ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 12 జనవరి 2024



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
6. శ్రీరామానుజ సుధామాధురి
8. వైదిక వివాహప్రక్రియ-గోదాకళ్యాణం
10. శ్రీపతిస్తుతి
11. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
12. నిధి చాల సుఖమా
12. గోదాం భక్తవనాం శ్రియం
13. జ్యోతిర్విజ్ఞానమ్
15. భరన్యాసము-భగవంతునిపై భారము
16. భాగవతంలో భగవంతుని కథలు
18. శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము
20. చక్కని చుక్కల ముగ్గులు
22. అవయవ విభూతి
23. పుస్తక పరిచయం
24. ఆధ్యాత్మిక వార్తలు



## సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్





# ముఖచిత్ర పరిచయం

తెలతెలవారుతుంటే... ప్రతి ఇంటా పండుగ వాతావరణం, ప్రకృతి శోభలు వెల్లివిరుస్తాయి. "తీరైన సంపద ఎవరింట నుండు! దిన దినము ముగ్గున్న లోగిళ్ల నుండు" అంటూ ఆరుద్రకలం నుంచి జాలువారిన గీతం చెప్పినట్లు... సిరులు తెచ్చిన పండుగ సంక్రాంతి. మరోవిధంగా చెప్పాలంటే పెద్దలూ, పిన్నలూ వేడుకచేసుకునే పండుగ... ఉదయాన్నే ముగ్గులు వేసి మకర సంక్రమణం ఉత్తరాయణ పుణ్యకాలాన్ని గుర్తుచేస్తే, గాలిపటాలను ఎగరేసి జీవన సత్యాన్ని గుర్తుకు తెచ్చుకునేవేళ ఆనందహేళ! ధర్మబద్ధంగా జీవనం సాగించాలన్న సందేశాన్ని తెలిపేలా ఇంటిముందు వేసిన ముగ్గులో గొబ్బిళ్ళు పెట్టి గంగిరెద్దు నిలుస్తే... ధర్మబద్ధంగా కాలం గడుస్తుందనీ... ఇంటికి వచ్చిన కొత్త పంటలు అచ్చివస్తాయన్న నమ్మకం. ఇలా మన పండుగలు పరమార్థాన్ని తెలియజేస్తూ సరికొత్త సందేశాలను అందజేస్తాయి. భక్తి తత్వాన్ని గీతాల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన త్యాగరాజు కీర్తనలతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరుపుకునే సందర్భం గుర్తు చేస్తున్నట్లుగా చిత్రకారుని కుంచెనుంచి జాలువారిన చిత్రం చెపుతోంది.


## గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు



PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



## కాలుష్య కోరల్లో గోదావరి విలవిలా

కాలుష్యం కోరల్లో చిక్కి గోదావరి విల విలలాడుతోంది. గోదావరి ప్రక్షాళన చేపట్టినా ప్రయోజనం కనిపించడంలేదు. గోదావరి నదిని సందర్శించడానికి వెళితే ఆ ఇసుకతిన్నలు, జలప్రవాహం గలగలలు ఇప్పుడు వినపడటంలేదు. నీటిలో తేలివస్తున్న నురగ, ప్లాస్టిక్ కవర్లు బాటిల్లు, వ్యర్థపదార్థాలు, బట్టలు ఇలా చెప్పుకుంటూ వెళుతే ఒక్కటేమిటీ ఎన్నో ఎన్నెన్నో మనకు కనిపిస్తాయి. గోదావరి నది ఒక మధుర జ్ఞాపకం, కిన్నెరసాని ఒక మధుర గీతం మరువలేనివి. గోదావరి ఒడ్డున యాత్రాస్థలాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు మరిచిపోలేనివి. కానీ అది గతం. వాస్తవానికి వస్తే మనస్సును కలచివేస్తోంది. కాలుష్య నివారణకు ఎవరెన్ని చేసినా ప్రయోజనం కనిపించడంలేదు. మన సంస్కృతి సంప్రదాయాలకు నదులు పుట్టినిళ్ళు. నదీ తీర ప్రాంతాల్లో విస్తరించిన సంప్రదాయ సంస్కృతి విధానాలు మనం మరువలేనివి. దేశంలో ప్రధాన నదులలో గోదావరి ముఖ్యమైనది. దీనిని దక్షిణ గంగా అని అంటారు. ఈ నది విశిష్టత గురించి పురాణాల్లో ప్రస్తావించారు కూడా. అయితే ఈ పవిత్ర జలాలు కనీసం స్నానానికి కూడా అనుకూలం కాని విధంగా ఉన్నాయి. ప్రవాహం పొడవునా అనేకచోట్ల పారిశ్రామిక వ్యర్థాలతోపాటు పట్టణాల నుంచి వస్తున్న మురుగునీటిని కూడా గోదావరిలోకి వదులుతున్నట్లు గుర్తించారు. భారతదేశంలో నది అంటే అది ఒక సాంస్కృతిక ధార, ధార్మిక ప్రదేశం, మనసును శరీరాన్ని ప్రక్షాళన చేసే పవిత్రమైన ప్రదేశం. ఈ భూమి మీద జన్మించిన నాటి నుండి కన్నతల్లిలా పోషించేదే నది. ముఖ్యంగా నదీ పరీవాహక ప్రాంతంలో వెలసిన పుణ్యక్షేత్రాలు వాటి ప్రాధాన్యతలు నదీ జలాలతో ముడివడి ఉన్నాయి. గోదావరి నది నాసిక్ త్రయంబకంలో పుట్టిన మొదలు మహారాష్ట్ర తర్వాత ఎక్కువగా ప్రవహించిన ప్రదేశం తెలంగాణాలోనే ఆ తర్వాత ఆంధ్రాలో ప్రవహిస్తూ సముద్రంలో కలిసిపోయింది. కందకుర్తి గ్రామం ద్వారా తెలంగాణలో ప్రవేశిస్తుంది. తర్వాత హరిద్ర, మంజీర గోదావరితో కలుస్తాయి. మరికొన్ని అంతర్వాహినిగా కలుస్తున్నాయి. భద్రాచలం మీదుగా పాపికొండలలో నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ కిన్నెరసాని, శబరి కలుస్తాయి. అక్కడ నుంచి రాజమహేంద్రవరం చేరి, విస్తరించి గంభీరంగా కనిపిస్తుంది. ధవళేశ్వరం వద్ద గౌతమి, వసిష్ట పాయలుగా విడివడుతుంది. అవి మళ్లీ రెండేసి పాయలుగా విడివడి అన్నీ కలసి బంగాళాఖాతంలో కలుస్తాయి. దేశంలో అతి పొడవైన నదులలో రెండవది గోదావరి. ఇది జీవనది. దక్షిణ గంగగా భావిస్తారు. మహారాష్ట్ర నాసికా త్రయంబకం వద్ద పశ్చిమ కనుమలలో పుట్టింది. సుమారు 1,465 కిలోమీటర్లు తూర్పువైపున ప్రవహిస్తుంది. మహారాష్ట్ర, ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలలో ప్రవహిస్తున్నది. చాలా ఉపనదులను కలుపుకుని ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్వేది వద్ద సాగరంలో సంగమిస్తుంది. ముఖ్యంగా గోదావరి నదిలో కలుషిత వ్యర్థాలు ప్లాస్టిక్ పదార్థాలు పేరుకుపోయి నీరు కనీసం స్నానం చేయడానికి కూడా యోగ్యతలేనివిధంగా తయారు అయ్యాయి. ఒక దశలో ఫ్యాక్టరీల నుంచి వస్తున్న వ్యర్థ పదార్థాలు నదులలో కలపడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయి. ఈవిషయాన్ని ప్రభుత్వాలు గుర్తించినా మిన్నకుంటున్నాయి. వర్షాకాలంలో వరద వృద్ధికి తెలంగాణాలోని రామగుండం పరిసర ప్రాంతాల్లో, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం వద్ద పేరుకుపోయిన నురుగతో కూడిన తేట గమనిస్తే త్రాగడం మాట ఎలా ఉన్నా మనకు తెలిసేది ఏమిటంటే గోదావరిలో కనీసం స్నానానికి కూడా నీరు ఉపయోగించలేమని అర్థమవుతుంది. ఈ పరిస్థితిని గమనించినా ఆందోళన చెందడంవినా అప్పటికప్పుడు ప్రభుత్వాలు ఏమీ చేయలేని సందర్భాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు మారుతున్న పరిస్థితులలో నీటి నిలువ సామర్థ్యం పెంచేలా గోదావరి నదిపై మధ్య మధ్యలో కరకట్టలు వేయడం వల్ల ప్రవాహోల్లో కొట్టుకు వచ్చిన వ్యర్థ పదార్థాలన్నీ పేరుకుపోయి మరింత కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. మనకు తెలియకుండా కలుషితం చేయడం, ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను, బట్టలను ఇతరత్రా పనికిరాని వాటనన్నిటిని నదీ జలాల్లో వదిలివస్తున్న సందర్భాలు ఉన్నాయి. నదితో ఉన్న సంబంధం ధార్మికమైనది. నదుల పట్ల భారతీయత అందించిన సందేశాన్ని మనం అర్థం చేసుకోలేక, భావితరాలకు స్వచ్ఛమైన నదీ జలాలు అందకుండా చేస్తున్నామన్నది వాస్తవం. ఈ వాస్తవం మనకు అర్థమయ్యేలోపు అనర్థం జరిగిపోయింది. ఒక మారు గతంలోకి తొంగి చూస్తే 20 సంవత్సరాల క్రితం ఉన్న గోదావరి నదిని ఒక మారు ఊహించుకుంటే!... ఇప్పటికైనా కనులు తెరువని పక్షంలో అనర్థం తప్పదు. ఈ కలుష్యాన్ని నివారించడానికి ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎవరికి వారే మొదలు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-వొడ్డిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**మార్గశిర మాసం 11-01-24 వరకు, 12-01-24 శుక్లపక్షంతో ప్రారంభమై 09-02-24 వరకు పుష్య మాసం**

10-01-2024 వరకు పూర్వాషాఢ కార్తి, 11-01-24 నుండి 23-01-24 వరకు ఉత్తరాషాఢకార్తి, 24-01-2024 నుండి 05-02-24 వరకు శ్రవణకార్తి, **పండుగలు** : 10-01-24 మాసశివరాత్రి, 11-01-24 అమావాస్య, 14-01-24 భోగి, 15-01-24 మకర సంక్రమణం, ఉత్తరాయణ పుణ్యకాలం, సంక్రాంతి పండుగ, 16-01-24 కనుమ, 21-01-24 సర్వేషాం ఏకాదశి, 26-01-24 గణతంత్ర దినోత్సవము,, 29-01-24 సంకష్టహర చతుర్థి, 30-01-24 త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల అనుకూలం ఉన్నందున ఉత్తేజంగా, ఉల్లాసంగా ఉంటారు. నూతన వస్తు, వాహన ప్రాప్తి, ప్రయాణాలు చేయుదురు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపెదరు.

**వృషభం:** ఈ నెల కూడా గ్రహసంచారం బాగాలేదు. శారీరక శ్రమ అధికంగా ఉండును. స్థానమార్పులు, గృహమార్పులుజరుగును. నూతనవస్తు, కుటుంబ సౌఖ్యం, మాసాంతంలో ఊహించని సంఘటనలు

**మిథునం:** ఈ నెల కొన్ని ఇబ్బందులు కలుగచేయును. ప్రయాణాలు చేయవలసివచ్చును. చిరకాల మిత్రులను కలుసుకుంటారు. సంతోషంతోఉంటారు. మాసాంతంలో ప్రయాణాలందు ఇబ్బందులు

**కర్కాటకం:** ఈ నెల కొంత ఫర్వాలేదు. కోపం ఎక్కువ. ప్రతీ చిన్నవిషయానికి ఆవేశపరులగుదురు. కొన్నికార్యాలు నిలిచి పోవును. ప్రయాణాలు చేయవలసివచ్చును.

**సింహం:** ఈనెల అనుకూలం. ఆకస్మిక ధనలాభం గతంలో వసూలుకాని బాకీలు వసూలగును. దూర ప్రయాణాలు చేయుదురు.

**కన్య:** ఈ నెలలో గ్రహసంచారం అనుకూలంగానే ఉంది. అన్నింటా జయం. ఆదాయంనకు లోటుండదు. వ్యాపారులకు మంచివ్యాపారం జరుగును. ఉత్సాహంగా, ఉల్లాసంతోఉంటారు.

**తుల** : ఈ నెల చాలా బాగుండును. అన్నిరంగాల వారు చేయు వృత్తి వ్యాపారములందు రాణించెదరు. ఆర్థికపరిస్థితి చాలా బాగుండును. ఆరోగ్యం బాగుండును.

**వృశ్చికం:** ఈ నెల యందు తిరుగుండదు. మీ ఆధిపత్యం చెలామణి అగుట, ప్రయాణాలు కలిసి వచ్చును. ప్రతీ విషయంలో చాలా ధైర్యంగా ముందుకు పోతారు. విజయలక్ష్మి వరించును.

**ధనుస్సు:** ఈ నెల అన్నిరంగాల వారికి అనుకూలం. ఆదాయం బాగుండును. ఆరోగ్యం బాగుంటుంది. వ్యవహారములు మీకు అనుకూలంగా ఉండును. వాహనసౌఖ్యం, నూతనవస్తు, వస్త్రప్రాప్తి,

**మకరం:** ఈ నెల వ్యాపారాలు బాగా జరుగును. ఖర్చులు అధికంగా ఉండును. అనవసర ధనవ్యయం, వ్యసనాల రీత్యా ధనవ్యయం, క్రొత్త సమస్యలు తలెత్తును. చికాకులు జాగ్రత్త అవసరం

**కుంభం:** ఈ నెల అన్నిరంగాల వారికి వ్యాపారములు రాణింపు ఉంటుంది. ఆర్థికంగా బాగుండును. నూతనవస్తు, వాహనలాభములు, సంతోషవార్తలు వింటారు.

**మీనం:** ఈ నెల అనుకూలం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు బాగా జరుగును. పాతమిత్రులను కలుసుకుంటారు. లోలోపల ఎన్నిఇబ్బందులున్నా పైకి కనపడక గోప్యంగా వ్యవహరించెదరు.

**త్రిజ్యేష్ఠ: వధూవరువులిద్దరును తల్లికి తొలిచూపు (ప్రథమగర్భమైన) జ్యేష్ఠమాసం వివాహం నిషిద్ధం, కన్య జ్యేష్ఠ నక్షత్రం, జ్యేష్ఠురాలైన, లేదా వరుడు జ్యేష్ఠుడై జ్యేష్ఠా నక్షత్రమైనను, ఇరువురి జ్యేష్ఠులు కలిసిన జ్యేష్ఠమాసం వివాహం నిషిద్ధం, జ్యేష్ఠమాసమందు జన్మించినను జ్యేష్ఠమాసములో కూడదు. (ధర్మసింధువు)**


## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ శుభముహూర్తములు 03,04,05,**

## పరంపరానుష్ఠానం గోదా గోవింద స్మరణం

**- శ్రీమతి సముద్రాల శారద**

పరంపరాగత సాంప్రదాయముల ఆచరణాశక్తి యొక్క సత్ఫలాలే భారతదేశ ఔన్నత్యానికి మూల కారణాలు. వేదాలలో చెప్పబడి, ఉపాసన శక్తి కలిగిన, ఋషి ప్రోక్తమైన విధివిధానాలే జాతికి మూల సంపద. సామాన్యులు కూడా ఆ ధర్మాలను తెలుసుకోవాలంటే పెద్దల ఆచరణలను సూక్తులను అనుసరించాలి. ఆ అనుసరణయే తరతరాలుగా పరంపరగా వస్తున్న మన సంస్కృతి. మానవ జీవన సరళిలో మనకు అంతర్గతంగా గోచరించే రహస్యం పారంపర్యమే! అవిచ్ఛిన్నమైన పరంపరాచరణ ధార అనేది జీవన గమనాన్ని సుగమం చేస్తుంది. ఆధ్యాత్మిక అంశాలేగాక లౌకికంగా భౌతికంగా కూడా క్రమానుగతంగా వచ్చే పరంపర అనేది అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం వహిస్తుంది. అధ్యయనమైనా, అభ్యాసమైనా అవిచ్ఛిన్నంగా సాగినప్పుడే దానికి సాఫల్యం ఉంటుంది. యుగాలు గడిచినా జనన మరణాలు జీవుల మూల స్థితి అలాగే ఉంటుంది. ఒక జాతి జ్ఞాన పరిణితిని పొంది కారణజన్ములైన వారు అవతరించి ఉద్ధరించడం వల్ల ఈ పరంపరాగత సంస్కృతి మరింత సంపన్నవంతం అవుతుంది. సాధారణంగా ఒక పని వ్యక్తిగతంగా అవిచ్ఛిన్నంగా చేయడం వలన అభ్యాసం, మెళకువ, నైపుణ్యం లభిస్తుంది. అలాగే కొన్ని వేద విహితమైన పవిత్రమైన సంప్రదాయాలు తరతరాలుగా అనుసరించటం వలన ఆ జాతికి దేశానికి దైవికమైన గొప్పతనం బలం సమకూరుతాయి. మార్పులు ఎన్ని సంభవించినా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా “పరంపర అఖండత” అనే మూల సూత్రాల పైన భారతీయ సనాతన ధర్మం నిత్య నూతనమై శాశ్వతమై నిలిచి ఉంటుంది. వంశాలు, ఇంటిపేర్లు, ఋషుల నామగోత్రాలు, ప్రవరలు, ఆధ్యాత్మిక ఉపదేశాలు, వాఙ్మయం ఇలా మరెన్నో పరంపరనే మూలాధారం చేసుకొని అనుసరించబడుతూ నిలిచి ఉన్నాయి. అంతేకాదు భౌతికంగా శరీర అంతర్గత గుణ స్వభావాలు ఆరోగ్య అనారోగ్యాలు, జ్ఞానప్రజ్ఞలు, అనువంశీకత రక్తసంబంధం ఆధారంగా కనిపిస్తుంటాయి. ఇది అందరూ అంగీకరించే ఆధునిక సైన్స్ కూడా! అలాగే పరంపర అనువంశికతవలె జ్ఞాన పరంపర కూడా విశేషమైనది. ఉపదేశ పరంపర మరింత విశిష్టమైనది. ఆత్మోజ్జీవన కారక మైనది. జగత్కారణమైన భగవత్ తత్వాన్ని గురించి తెలిపే ఈ ఉపదేశ పరంపర మహిమాన్వితమైనది.



అటువంటి గొప్ప ఉపదేశ సంప్రదాయ వ్యవస్థను భగవద్రామానుజారాచార్యులు నెలకొల్పారు ఈ గొప్ప సాంప్రదాయాన్ని తరతరాలుగా నిలిచి ఉండేలా స్థిరీకరించారు. తన బోధనల ద్వారా, సిద్ధాంత వాంగ్మయం ద్వారా జ్ఞానాత్మకంగా స్థాపించారు. సర్వహిత అనుష్ఠాన, భగవదారాధనల ద్వారా క్రియాత్మకంగా స్థాపించారు. దేవాలయ నిర్మాణ సమయాచారముల ద్వారాఆచార్య పీఠాల స్థాపన ద్వారా నిర్మాణాత్మకంగా స్థాపించారు.

ఆ క్రమంలోనే శ్రేయోదాయకము సర్వహితమైన అనుష్ఠానాలను ఆరాధనలను ఏర్పాటు చేశారు శృతి స్మృతి నియమానుసారం అందరూ వేదాధ్యయనం చేయ లేకున్నను అంతటి గొప్ప ఫలాన్ని ఇచ్చే వ్రతాచరణతో ద్రావిడ ప్రబంధమైన గోదావిరచిత తిరుప్పావై పారాయణ క్రమాన్ని శ్రీవైష్ణవ దివ్యదేశాల యందు సేవా కాలాన్ని ఏర్పాటు చేశారు. గోదాదేవి తత్వంపై యతి రాజులకు ఉండే ప్రీతిని మూడు అంశాల ద్వారా విశ్లేషించవచ్చు. బోధనలు, సన్నివేశాలు, ఆచరణ విధానాలు.

భగవత్ రామానుజాచార్యులు ఆళ్వారాచార్యుల దివ్య వాఙ్మయాన్ని శిష్యులకు బోధించి వారిచే వ్యాఖ్యాన గ్రంథాలు రాయించారు. యతిరాజులు మాత్రము సిద్ధాంత గ్రంథాలే రచించారని పెద్దలు విశ్లేషిస్తారు. భగవద్ రామానుజాచార్యు లకు ఆండాళ్ తల్లి రచించిన నాచ్చియార్ తిరుమొళి,

తిరుప్పావై రెండు ప్రబంధాలన్నా ప్రేమాతిశయం! వారి ప్రీతిని నిరూపించే రెండు సన్నివేశాలను వారి చరిత్రలో మనం గమనించవచ్చు. యతిరాజులకు తిరుప్పావై జీయర్ అని పేరు. ఈ నామాన్ని వారి గురువుగారైన పెరియనంబి వారే ప్రదానం చేసినట్టు చరిత్ర. సన్యాసాశ్రమం స్వీకరించిన తర్వాత నిత్య భిక్షా సంచారంలో వారు తిరుప్పావై అనుసంధానం చేస్తూ 'సంతత స్ఫురిధాతరః' అన్నట్లు "ఉందు మదగలిత్త" అనే అనే పాశురాన్ని పఠిస్తూ ఒక ఇంటి ముందు భిక్షకై ఆగారు. అర్థానుసంధానంలో పరవశులై నీళా దేవి చేతి కడియాలు ఘల్లుమన్నట్లుగా తలుపు తెరుచుకున్నట్లుగా భావించి తలుపు తెరిచిన గురు కుమార్తె పాదాలపై మోకరిల్లారట! ఆమె వెంటనే కంగారుగా వెనుకడుగు వేసింది. కారణం గ్రహించిన పెరియనంబి వారు యతి రాజుల భక్తి పరవశానికి ముగ్ధులై "తిరుప్పావై జీయరే"! అని సంబోధించారు!

గోదాదేవి విరచితమైన నాచ్చియార్ తిరుమొళిలో కీర్తించినట్లుగా వంద గంగాళాల పాయసాన్ని భగవంతునికి సమర్పించారట. భగవద్ రామానుజాచార్యులు శ్రీవిల్లి పుత్తూరు దర్శన సంకల్పంలో బయలుదేరి తిరుమాలిరుంశోలై దివ్యదేశంలో అజఘర్ కోయిల్ దర్శించి సుందర బాహు పెరుమాళ్ళకు గోదాదేవి మొక్కు తీర్చడానికి నూరు పాత్రల అక్కారుఅడిసెల్ పాయసాన్ని నివేదనం గావించారు. వెంటనే అర్థ మంటపం నుండి లేచి ఆండాళ్ తల్లి "కోయిల్ అన్నన్" అని సోదరునిగా సంబోధించినట్లు సుందరమైన కథనాన్ని పెద్దలు చెప్తారు. ఆ విధంగా గోదాగ్రజులుగా యతిరాజులు సంబోధించబడ్డారు. వాళి తిరునామాల్లో **"పెరంబుదూరు మామినుక్కు పిన్నానాళ్ వాళియే"** అని కీర్తిస్తారు. గోదా చతుశ్లోకిలో కూడా **"మాతా చేత్ తులసీ పితా యది తవ శ్రీవిష్ణు చిత్తో మహాన్ భ్రాతాచేత్ యతిశేఖర ప్రియతమ శ్రీరంగధామ"** అని గోదాదేవి భ్రాతగా యతిరాజులను అభివర్ణిస్తారు. ఈ ఐతిహ్యాన్ని ప్రసిద్ధం చేస్తూ భగవత్ ప్రీతికరంగా కూడారై అను విశేష పాశురమందు గంగాళాల్లో పాయసాన్ని నివేదనం చేస్తారు

గోదా సోదరులు కనుక శ్రీరామానుజ హస్తమాల కూడా భగవంతునికి ప్రీతికరము అని మాలా సమర్పణము చేయడము, నాటినుండి ప్రపత్తి మార్గంలో భగవత్ ప్రాప్తి పొందిన ఆండాళ్ భక్తికి ప్రతీకగా అధ్యయనోత్సవాల్లో భాగవతోత్తములతో "ఆండాళ్ గోష్ఠిని" నిర్వహించడం ఆచారంగా ఉంది.

గోదాతత్వంలో గల భక్తి, శరణాగతి దాని వలన పొందిన ఫల ప్రాప్తి ఇలా ఎన్నో రహస్యాలు రామానుజ సిద్ధాంతానికి మూలమైనవి. గోదాతత్వం శ్రీ వైష్ణవ సిద్ధాంతంలో మరింత ప్రాధాన్యం సంతరించుకొనుటకు ఆళ్వారులలో ఆమె ప్రత్యేక స్థానం పొందుటకు కారణం ఆమె సహజ స్త్రీత్వం. అది ఆత్మ స్వరూపమైన పార తంత్ర్యానికి నిదర్శనం. సకల వేద శాస్త్ర సారంగా భగవంతుని పొందుటకు ఉపాసనాత్మక భక్తి మార్గమునే ఆండాళ్ తత్వము శ్రీరామానుజమార్గము కూడా బోధిస్తాయి. "అళంన్దాన్" అనే ద్రావిడ పద రూపంగా చేతనులను భగవదాభిముఖంగా చేర్చునదిగా ఆండాళ్ తత్వాన్ని విశ్లేషిస్తారు. శ్రీవైష్ణవ సిద్ధాంతంలో కూడా భగవత్ ప్రాప్తికి ప్రేరకులుగా ఆచార్యులను భాగవతోత్తములను లక్ష్మీదేవిని పురుషకారంగా భావిస్తారు. సాంప్రదాయంలో కామ్య వ్రతాలకు తావులేదు కానీ భగవత్కాముకంగా చేసే తిరుప్పావై వ్రతాన్ని పరంపరగా ఆచరించే విధానాన్ని ప్రవేశపెట్టారు. కుల లింగ వివక్షత లేకుండా గృహాల్లో దేవాలయాల్లో గోష్ఠిలో ఈ వ్రతాన్ని ఆచరించే విధివిధానాలను ఏర్పాటు చేశారు. నామ సంకీర్తనం శరణాగతి శ్రీరామానుజ మార్గంలో కూడా ప్రధానంగాలు. "కాయేన వాచా మన సేంద్రియైర్వా "అని మనోవాక్కాయ శుద్ధిగా చేసే ప్రపత్తిని యతిరాజ మార్గం కూడా బోధిస్తుంది. ప్రధానంగా ఆండాళ్ తత్వమందు భగవద్ రామానుజ ఉపదేశములందు తత్వహిత పురుషార్థాలే బోధింపబడ్డాయి.

**"ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాసాంబరీష శుక శౌనక భీష్మ దాల్భ్యాన్ రుక్మాంగదార్జున వశిష్ఠ విభీషణాదీన్ పుణ్యానిమాన్ పరమ భాగవతం స్మరామి"** అని ఆర్యోక్తి ననుసరించి ఎందరో పరమ భాగవతోత్తములు భగవద్ తత్వాన్ని బోధించారు. అయినను **"లక్ష్మీనాథ సమారంభాం నాథ యామున మధ్యమాం అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం"** అని అవిచ్ఛిన్న పరంపరగా ఉపదేశములందించిన గురుపరంపరను అనుసరిస్తూ స్తుతిస్తాము. అటువంటి పరంపరను స్థిరీకృతం, శాశ్వతం చేసిన వారు భగవద్ రామానుజాచార్యులు. అవిచ్ఛిన్న భక్తి భావ స్ఫూర్తిగా గోదా గోవింద ఆరాధన పూర్వకమైన వ్రత సాంప్రదాయాన్ని లోకహితంగా అందించి అనుగ్రహించారు భగవద్రామానుజాచార్యులు.

★



# వైదిక వివాహ ప్రక్రియ

## గోదాకళ్యాణం

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

భక్తి సంప్రదాయంలో ఆళ్వార్లకు ప్రత్యేకమయిన స్థానం ఉంది. అలాంటి పన్నెండు మంది ఆళ్వార్లలో గోదాదేవి ఒక స్త్రీమూర్తి, సాక్షాత్తుగా భూమాత అంశగా లక్ష్మీదేవి పరిపూర్ణ లక్షణములు ఉన్న మహాతల్లిగాను. గోదాదేవిని కీర్తిస్తారు. ఆమహనీయమైన గోదాదేవి అవతారం ఎందుకు ఏర్పడిందంటే ఆనందాళ్వార్లు గోదా చతుశ్లోకిలో **కల్పాదౌహరిణాస్వయం జనహితం దృష్ట్వేన సర్వాత్మనాం...** అనే శ్లోకంలో అంటారు. ఈ వరాహ కల్ప ఆరంభంలో వరాహమూర్తి భూదేవికి కలియుగంలో వారంతా తరించే ఉపాయం చెప్పారట! మూడు సాధనాలను వరాహ మూర్తి చెప్పారు. **స్వస్యచకీర్తనం** భగవంతుని నామ సంకీర్తనం చేయడం ముక్తికి ఉపాయం! **ప్రపదనం** అనగా భగవంతుడే సర్వరక్షకుడు అని పరిపూర్ణ విశ్వాసంతో భగవంతుని శరణాగతి చేయడం! ముక్తి సాధనం.



**స్వస్మై ప్రసూనార్పణం** ఆ భగవంతుని కొరకు పూల మాలను సమర్పించటం అను ఈ మూడు ముక్తి సాధనములు. అని వరాహస్వామి భూదేవికి ఉపదేశించాడు. ఆ ఉపదేశము లను తానాచరించి ఈ లోకంలోని మానవులకు చూపించటం కోసం గోదాదేవిగా భూదేవి అవతరించింది! **వైదిక విష్ణు చిత్త తనయాం** అని పరమవైదికులైన విష్ణుచిత్తులనే మహానీయులైన పెరియాళ్వార్లకు కుమార్తెగా అవతరించింది. ఈ మూడు సాధనములను భగవంతుని విషయంలో ఆచరించి చూపించింది.

ఏమిటి ఆచరణము అంటే! అనేక సందర్భాల్లో **పరమనడిపాడి కైశవనై పాడవుం నీకేట్టే కిడిత్తియో** అని ఇలా తిరుప్పావై ప్రబంధంలో భగవత్ సంకీర్తనాన్ని ప్రత్యేకించి పేర్కొంది. పరమాత్మను అనేక నామాలతో కీర్తించింది. ఇదే ముక్తికి ఉపాయమని ఆచరించి చూపింది. రెండవది శరణాగతి చేయటం. గోదాదేవి సంప్రదాయమే శరణాగతి సంప్రదాయం. అందుకే తిరుప్పావై లోని చిట్ట చివరి పాశురంలో అంటుంది **ఎత్తైక్కుం ఏడేడు పిరవిక్కుం** అంటూ ఓ శ్రీకృష్ణ పరమాత్మా! ఏడేడు జన్మలకూ నీతో సంబంధం కలిగి ఉండే వాళ్ళంగా ఉండాలి. నిరంతరం నీకే మాసేవలు చేసే భాగ్యం కలగాలని శరణాగతి చేసింది. భగవంతుడు చెప్పినట్టుగా పుష్ప సమర్పణం చేసింది. విష్ణుచిత్తులు భగవంతుని కైంకర్యం చేసిన విధంగా తానూ పూలమాలిక అర్పించింది.

గోదాదేవిది మధుర భక్తి అంటారు. అనగా **మావిడ వర్కుమ్ పేచ్చిరప్పడిల్** నాచ్చియార్ తిరుమొళి అనే ప్రబంధంలో చెబుతుంది గోదాదేవి. మనుషులకు తనన్నిచ్చి వివాహం చేస్తాను అంటేనే తట్టుకోలేని మహాభక్తి కలిగిన వ్యక్తి ఆమె. సాక్షాత్తు భగవంతుణ్ణే భర్తగా భావించిన భక్తురాలు. నిజానికి అది సాధ్య పడుతుందా అని మనయొక్క సందేహం!. ఒక అర్చామూర్తిగా ఉన్న రంగనాథస్వామినే గోదాదేవి వివాహం చేసుకున్నది అని ఆమె చరిత్ర. అది సాధ్యపడుతుందా? మానవ కన్యగా ఉండి

విగ్రహరూపంలో భగవంతుని వివాహం చేసుకోవటం సాధ్యమా ? అనే ప్రశ్న తలెత్తినప్పుడు గోదాదేవి విషయంలో ఎలా సాధ్యమయిందో చరిత్ర చెబుతుంది. ఆమె ఎంతగా కృష్ణ పరమాత్మను ప్రేమించిందంటే అది ఒక అష్టాంగ యోగ సాధన వంటిది అంటారు పెద్దలు. ఆమె చిన్నతనంలోనే పండిపోయిన జ్ఞానం గలది. ఆ జ్ఞానము భక్తి రూపాపన్నమైనది. విగ్రహరూపంలో ఉన్న రంగనాథస్వామిని భర్తగా భావించి నెలరోజులపాటు తిరుప్పావై వ్రతాన్నాచరించింది. తాను చేసిన వ్రతానికి ఫలితంగా వ్రత సమాప్తిలో ఆమెకు ఒక చక్కని స్వప్నం కలిగిందట! అది రంగనాథునితో తనకు వివాహమయిన వృత్తాంతం. రంగనాథుడు శ్రీవిల్లిపుత్తూరుకు వచ్చినప్పుడు అల్లునిగా విష్ణుచిత్తుల వారు మర్యాదలు చేశారు. అలాగే తనకూ రంగనాథునికీ ఏవిధంగా కళ్యాణం జరిగిందో దాన్నంతా నాచ్చియార్ తిరుమొళిలో వారణమాయిరవమ్ అనే ప్రబంధ రూపంలో స్నేహితురాలికి చెబుతున్నట్టుగా చెప్పింది.

ఆ ప్రబంధంలో వైదికమైన వివాహ ప్రక్రియ ఏవిధంగా ఉంటుందో ఏవిధంగా తనకూ రంగనాథునికీ జరిగిందో స్నేహితురాలికి చెప్పిన వారణమాయిరంలో వైదికమైన వివాహ ప్రక్రియ అంతా కన్పిస్తుంది.

**ఈ ప్రబంధంలో పూర్తిగా వైదికమైన వివాహ ప్రక్రియలో ఉండే వరాగమనం, వరనిశ్చయం, ప్రతిసర బంధనం, పాణిగ్రహణ ముహూర్తం, సన్నికల్లు, లాజహోమాలు, వసంతోత్సవము అని చెప్పబడటం ఆశ్చర్యకరం.**
**ఆలయాల్లో కాని వారి వారి ఇండ్లల్లో జరిగే వివాహాల్లో గానీ ఈ ప్రబంధాన్ని చాలా పవిత్రంగా అనుసంధిస్తారు. ఎందుకనగా వివాహదుల్లో జరిగే చిన్న చిన్న లోపాలు ఈ ప్రబంధానుసంధానం వల్ల తొలగిపోతాయని చెబుతారు.**

**వారణమాయిరం శూళ వలైశెయిదు నారణ నంబి నడక్కిన్హా..** ఓ స్నేహితురాలా! నేను కనాక్కండేన్ గొప్ప కలగన్నాను. అదేమిటనగా శ్రీకృష్ణ పరమాత్మ రంగనాథుడు పరివారంతో వేయి ఏనుగులతో వివాహం చేసుకోవడానికి తాను వచ్చాడు. అప్పుడు విల్లిపుత్తూరులో ఉండే ఊరి జనం అంతా కూడా నన్ను పెళ్ళాడబోయే రంగనాథుడు ఊరందరికి కూడా అల్లుడని ఇండ్లకు పచ్చని తోరణాలు కట్టారు. ప్రతి ఇంట్లోంచి రంగనాథస్వామికి బంగారు పూర్ణకుంభంతో స్వాగతం ఇచ్చారు. **పూరణ పొర్కుడం వైత్తు ప్పురమెంగుం** అనిచెప్పుతుంది. రేపే వివాహ ముహూర్తం! ఆ వివాహ పత్రికను తీసుకొనివచ్చి పందిట్లో వివాహ నిశ్చయాన్ని చేసుకున్నారు. దీన్ని తమిళనాట వివాహానికి ముందు రోజు చేసే "జానివాసం" అనే ఒక ప్రక్రియ చేస్తారు. వివాహ నిశ్చితార్థం అని వివాహనికి ముందురోజు చేసే పద్ధతి తమిళనాట ఉంటుంది. ఇది రెండవ పాశురం ద్వారా గోదాదేవి చెప్పింది. మూడవ పాశురంలో నిశ్చితార్థం జరిగిన తర్వాత రంగనాథుని చెల్లెలు దుర్గాదేవి అని ఆడపడుచు అయిన దుర్గాదేవి గోదాదేవికి పసుపు చీర కట్టి పెళ్ళి కూతురుకి చేయవలసిన చక్కని అలంకారాలు చేస్తుంది. నాల్గవ పాశురంలో వివాహ సందర్భంగా పురోహితులైనవారు రంగనాథునికీ తనకూ చక్కని ప్రతిసర బంధనం (కంకణధారణము) చేశారు అనగా వివాహమనే వ్రతం చేయడానికి రక్షాబంధనం జరిగిందని చెబుతుంది. ఐదవ పాశురంలో రంగనాథ స్వామి శ్రీవిల్లిపుత్తూరులోని మండపానికి విచ్చేసినట్టుగా చెబుతుంది. రంగనాథ స్వామి తానెదురు ఎదురుగా ఉన్నప్పుడు. తన చేతిని పట్టుకున్నట్టుగా పాణి గ్రహణం జరిగినట్టుగా నేను కలగన్నాను అంటుంది. 7వ పాశురంలో తానూ రంగనాథస్వామి అగ్ని ప్రదక్షణం చేసినట్టుగా **తీవలం శయ్య** అనగా ఆ అగ్నికి ఇద్దరం చేతులు పట్టు కొని ప్రదక్షణం చేసేనట్టుగా కలగన్నాను అంటుంది. 8వ పాశురంలో రంగనాథస్వామి తన పాదాలు పట్టుకొని "సన్ని కల్లు" తొక్కించినట్టుగా చెబుతుంది. ఆ మట్టెలు పెట్టే విధానం కూడా మనకు ఆచారంలో ఉంది. **ఇమ్మైక్కుం ఏళేళు పిరవిక్కుం పత్తావాన్ నమ్మైయుడయవన్ నారాయణన్ నమ్బి** నారాయణన్ పేరు గల రంగనాథ స్వామి ఎప్పుడూ జీవులతో సంబంధం కలిగినవాడు. ఈ జన్మలో అని కాదు ఏడేడు జన్మలకు రంగనాథ స్వామియే మనకు ప్రభువు. అలాంటి రంగనాథ స్వామిని వివాహం చేసుకోబోతున్నాను. ఏడేడు జన్మల సంబంధం గల రంగనాథస్వామి చక్కనైన తన కరపంకజములతోటి కాళ్ళు పట్టుకొని సన్ని కల్లును తొక్కించి నాకు మెట్టెలు పెట్టినట్టుగా కలగన్నాను అంటుంది. ఆ తరువాత లాజహోమం వివాహ ప్రక్రియలో

ప్రధానమయినది. భార్యా భర్త లిరువురు చేసేది. దాన్ని చెబుతూ తన సోదరులైనవారు రంగనాథ స్వామిని ఆహ్వానించారు. వారు పక్కనే ఉండగా అగ్నిముఖం జరిగిన తరవాత హెూమం చేయించేటప్పుడు తన యెదురుగా రంగనాథ స్వామి ఉండి తన చేతులతో పేలాలు తీసుకొని ఆ లాజలతో హెూమం చేయించాడు అని చెబుతుంది. తరువాత వసంతోత్సవ మనేది ప్రధాన ప్రక్రియ. నూతన వధూ వరులు ఒకరిమీద ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపే విధానం. రంగనాథుడు కుంకుమ వసంతాలు చల్లాడు. నేనూ ఆయనపై జల్లాను. అని 10వ పాశురం ద్వారా గోదాదేవి వసంతోత్సవ విధానాన్ని చెబుతుంది. మంత్ర శాస్త్రంగానీ వేద శాస్త్రంగాని ఏంచెబుతుంంటే? సాధనచేసినప్పుడు ఒక మంత్రానుష్ఠానమో వ్రతమో చేసిన తరువాత ఆవ్రతం సిద్ధించింది. మంత్రం సిద్ధించింది అనటానికి గుర్తుగా కలల రూపంలోనో శుభశకునముల రూపంలో సిద్ధి అనేది మనకు తెలుస్తుంది అని చెబుతుంది.

దాని ప్రకారంగా 30 రోజులు చేసిన తిరుప్పావై వ్రతానికి ఫలితంగా ఆమె రంగనాథునితో వివాహమైనట్టుగా కలగన్నది ఆకల మొత్తాన్ని తన స్నేహితురాలితో చెబుతున్నట్టుగా ఈ ప్రబంధంలో అంతా వర్ణింపబడింది.

ఈ ప్రబంధంలో పూర్తిగా వైదికమైన వివాహ ప్రక్రియలో ఉండే వరాగమనం, వరనిశ్చయం, ప్రతిసర బంధనం, పాణిగ్రహణ ముహూర్తం, సన్నికల్లు, లాజహెూమాలు, వసంతోత్సవము అని చెప్పబడటం ఆశ్చర్యకరం. వైష్ణవ సంప్రదాయంలో ఉండే ఆలయాల్లో కాని వారి వారి ఇండ్లల్లో జరిగే వివాహాల్లో గానీ ఈ ప్రబంధాన్ని చాలా పవిత్రంగా అనుసంధిస్తారు. ఎందుకనగా వివాహదుల్లో జరిగే చిన్న చిన్న లోపాలు ఈ ప్రబంధానుసంధానం వల్ల తొలగిపోతాయని చెబుతారు. ఈ ప్రబంధంలో వివాహ ప్రక్రియ అభివర్ణింపబడింది. ఆ విధంగా తనకూ రంగనాథునికి కలలో జరిగిన కళ్యాణాన్ని అభివర్ణించింది. ముఖ్యంగా ఈనెల మకర సంక్రమణానికి ముందుగా ధనుర్మాసంలో చివరి రోజు భోగిపండుగ. ఆ భోగిపండుగ గోదా రంగనాథుల కళ్యాణం జరిగిన రోజు. భోగి అనగా గొప్ప భోగము, పరమాత్మతో జీవాత్మ కలవడం గొప్ప భోగం. లోకంలో ఉండే భోగాలు అశాశ్వతమైనవి. భగవంతునితో కలిగి ఉండే యోగమే గొప్ప భోగము. అలాంటి గొప్ప భోగము, యోగము లభించినటువంటి మానవ కన్య గోదాదేవి. గోదాదేవి సాక్షాత్తుగా పరమాత్మ అయిన అర్చామూర్తి రంగనాథునిలో ఐక్యమైన గొప్పస్థితి ఈ కళ్యాణం వల్ల తెలుస్తుంది. భోగినాడు వివాహం తరువాత ఆమె రంగనాథుని యొక్క అర్చామూర్తిలో లీనమయింది అని ఆమె యొక్క చరిత్ర.

ఆళ్వారులలో గోదాదేవి, తిరుప్పాణాళ్వార్లు విశిష్టమైన వక్త్యులు. ఇతర ఆళ్వార్లు తమ భౌతికదేహం విడిచి సిద్ధి పొందినట్టుగా చరిత్రలు చెబుతున్నాయి. తిరుప్పాణాళ్వార్లు గూడా రంగనాథునిలో లీనమయ్యారు అనే కథ కన్పిస్తున్నది. అదే విధంగా గోదాదేవి రంగనాథునికి వివాహమయిన తరువాత రంగనాథుని అర్చామూర్తిలో తాను లీనమయింది అని చరిత్ర ద్వారా పెద్దలు చెప్పుతారు. అటువంటి మహనీయురాలు గోదాదేవి. ఆ విధంగా గోదాదేవి రంగనాథునిలో ఐక్యమై అర్చామూర్తిగా పుంజింప బడుతున్నది.

**కర్కటే పూర్వ ఫల్గుణ్యాం తులసీ కాననోద్భవాం**
**పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్** అని ఆమెను స్తుతిస్తారు.


కర్కాటక మాసంలో భూదేవికి అంశగా అవతరించిన గోదాదేవి రంగనాయికిగా రంగనాథుని పత్నిగా పూజ్యురాలయింది. రంగనాథుని వివాహం చేపుకొని అమ్మవారిగా పూజలందుకుంటున్నది. భగవత్ సాయుజ్యం పొందింది.

అటువంటి గోదాదేవి కళ్యాణాన్ని భోగి పండుగ నాడు అందరూ జరుపుకొని ఆనందాన్ని పొందుతారు. సీతారాముల కళ్యాణానికి ఎంత ప్రాముఖ్యత ఉన్నదో గోదాకళ్యాణానికి అంత పాధాన్యం ఉన్నది. సీతారాములు అందరికీ ఎలా ఆరాధ్యులో గోదారంగనాథులూ అందరికీ ఆరాధ్యులు. ఎందుకనగా రాముడే పూజించి నటువంటి రంగనాథున్ని తాను వివాహం చేసుకున్నది. రాముని అవతారం ఎలా ఆచరణాత్మకమైన అవతారమో భూదేవి అంశ అయిన గోదాదేవి అవతారం కూడా ఆచరణాత్మకమైనది. ఆమె ఆచరణ మనబోటి భక్తులందరికీ ఆదర్శం. విగ్రహరూపంలో అర్చామూర్తిగా ఉండే భగవంతుణ్ణి శరణాగతి చేసింది. భగవన్నామ సంకీర్తనం అనేది సులభ సాధనం. దానిని ఆచరించింది. విగ్రహ రూపంలో ఉండే స్వామికి మాలలు అర్పించింది. ఈ విధంగా ఆచరించి చూపింది. అటువంటి గోదాదేవి కళ్యాణ వైభవాన్ని భోగి పండుగ రోజు ఆచరించ టం సకల శుభాలనూ కలుగజేస్తుంది. ★

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**



ప్రాతర్నిత్యానుసంధానంలో
'పంచాయుధ స్తోత్రము'
5వ ఆయుధము 'ధనుస్సు'

**శ్లో॥ యజ్జ్యానినాద శ్రవణాత్సురాణాం**
**చేతాంసి నిర్ముక్త భయాని సద్యః ।**
**భవంతి దైత్యాశని బాణవర్షి**
**శార్ఙ్గం సదాహం శరణం ప్రపద్యే ॥**

ప్రతిపదార్థం: యజ్జ్యానినాద = ధనుష్టంకారము వలన గలిగిన ధ్వని, శ్రవణాత్ = వినడం వలన, సురాణాం = దేవతల యొక్క, చేతాంసి = మనస్సులు, సద్యః = వెంటనే, నిర్ముక్త = విడువబడిన, భయాని = భయములు గలవియై, భవంతి = అగుచున్నవి, దైత్య = రాక్షసులపై, అశని = పిడుగుల వంటి, బాణ = బాణములను, వర్షి = వర్షించుచున్న, శార్ఙ్గం = శారఙ్గము అనే పేరుగలిగిన ధనుస్సును, అహం = నేను, సదా = ఎల్లప్పుడు, శరణం = రక్షకం అని, ప్రపద్యే = పట్టుకొను చున్నాను.

తాత్పర్యం: విష్ణు మూర్తి ఆయుధములలో ధనుస్సు ఒకటి. ధనుస్సు ఒక అల్లెత్రాడుచే ఈ కొస ఆకొసను కట్టుదురు. ఆ త్రాడుకు బాణము సంధించి లాగి విడుతురు. దేనికి ఆ బాణం తాకాలో దానిని లక్ష్యంగా పెట్టుకుంటారు. ఐతె వీరులైన వారు అల్లెత్రాడు ధనుస్సుకు కట్టి బాణం లేకుండా ఒక సారి ఆ త్రాడును గుంజి విడుస్తారు. అప్పుడది ధ్వనిస్తుంది. ఆ ధ్వనితోనే ఆ వీరుని బలం ప్రత్యర్థులకు తెలిసి పోతుంది. ఇప్పుడు కుస్తీలు పట్టేవారు జబ్బలు చరుచుకోవడం, తొడకొట్టుకోవడం, గట్టిగా బెదిరిపోయేట్టుగా అరవడం వంటివి చేస్తారుగదా! అట్లే వీరులు ధనుర్విద్యలో నైపుణ్యం గలవారు. మొదటనే బాణం వదలరు, నారిని లాగి విడుస్తారు. దానిని ధనుష్టంకారం అంటారు. విష్ణుమూర్తి రాక్షసులను సంహరించాలనుకొని ధనుష్టంకారం చేయగానే ఆ భయంకరమైన ధ్వనివినే రాక్షసులు పారిపోతారు. దేవదానవులు యుద్ధానికి సిద్ధమైనప్పుడు దానవుల చేతిలో ఓడిపోతామని దేవతల గుండెల్లో భయం చూస్తుంది. దానితో వారి మనస్సులు వికలమౌతాయి. పిరికి తనం కలుగుతుంది. ఆ సమయంలో విష్ణువు దేవతల పక్షం వహించి రాక్షసులను లక్ష్యంగా చేసుకొని ధనుష్టంకారం చేస్తాడు. అది వినగానే దేవతలకు దానవుల వలన గలిగిన భయం పటాపంచలై పోతుంది. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ దైత్యులపై బాణాలను వర్షించుతాడు. ఆ బాణాలు పిడుగుల వలె రాక్షసులపై పడి సర్వనాశనం చేస్తాయి.

ఆవిధంగా శత్రుసంహారం చేయగల ధనుస్సును నాకు రక్షకంగా శరణు వేడుచున్నాను.

ఫలశ్రుతి

**ఇమం హరేః పంచమహాయుధానాం**
**స్తవం పఠేత్ యోనుదినం ప్రభాతే ।**
**సమస్త దుఃఖాని భయాని సద్యః**
**పాపాని నశ్యంతి సుఖాని సంతి ॥**

ప్రతిపదార్థం యః = ఎవడైతే, ప్రభాతే = ఉదయమున నిద్రలేవగనే, అనుదినం = ప్రతిదినము, హరేః = శ్రీహరి యొక్క, ఇమం = ఈ, పంచమహాయుధానాం = ఐదు మహా యుధముల యొక్క, స్తవం = స్తోత్రమును, పఠేత్ = చదవడం వలన (చదువునో) వాని యొక్క, సమస్త దుఃఖాని = అన్ని దుఃఖములకు కారణములైన, పాపాని = పాపము లన్నియు, భయాని = భయము లన్నియును, సద్యః = చదివిన వెంటనే, నశ్యంతి = నశించుచున్నవి, అట్లే సుఖాని = అన్ని సుఖములు సంతి = వుంటున్నవి.

తాత్పర్యం: పరమాత్మకు అనేకములైన దివ్యా యుధములున్నను అందులో చాల గొప్పవైన ఈ 5 ఆయుధముల యొక్క స్తోత్రమును ఉదయం నిద్రలేవగానే ఎవరు చదువుతారో వారి అనంత దుఃఖములకు కారణములైన పాపాలన్ని చదివిన వెంటనే నశించి పోతాయి. దుఃఖాలు పోవడమే కాదు అనంత (మిగతా 23 వ పేజీలో)






# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

## వర్గ ప్రయోజనము

శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్రీమతే రామానుజాయనమః

**శ్లో॥ అష్టవర్గ మను సృత్య కథ యామ్యపరాజిత।**
**దంపతీ స్వామి భృత్యా చ గృహగ్రామాధిసాసదా॥**
**లాభాలాభౌచ యేషాంతే కథయే త్వపరాజిత॥**

**(అపరాజిత పృచ్ఛ)**

ఈ అష్టవర్గములను అనుసరించి భార్యా భర్తలకును, స్వామి భృత్యులకు, గృహాధిపతి. గ్రామాధితులకును గల మిత్ర శతృత్వములను లాభనష్టములను నిర్ణయించి తెలిసికొనిన క్షేమము కలుగును.

**శ్లో॥ వర్గేశాస్తార్క్ష్య మార్జాల సింహా శ్వాస్సర్పమూషికాః।**
**ఇభేణా పూర్వతస్తేషాం స్వ వర్గా త్పంచమోరిపుః।**
**తస్మాత్స్వవైరి వర్గస్వదిశి వాసోప శోభన॥**

**(భూపాల వల్లభం)**

**శ్లో॥ అకారాదిషు వర్గేషు దిక్వష్టసు యథాక్రమం।**
**గృధ్ర మార్జాల సింహాశ్వ సర్పాఖుగజశాశకాః।**
**దిగ్వర్గానా మియం యోని స్స్వవర్గా త్పంచమోరిపుః।**
**రిపువర్గం పరిత్యజ్య శేష వర్గ శ్శుభప్రదః॥**

**(వశిష్ఠ సంహిత)**

గ్రామ మధ్యము నుండి గ్రామమునకు వర్గములను ఏర్పరచి అందులో గృహనిర్మాత తన శత్రు వర్గ దిశాస్థానము నందు ఆ గ్రామములో గృహమును నిర్మించుకొనకూడదు. మిగిలిన వర్గ దిశా స్థానములలో గృహమును నిర్మించుకొన వలయును.

**శ్లో॥ సాధ్యవర్గం పురః స్థాప్య పృష్టత స్సాధకస్యచ।**
**విభజే దష్టభిశ్శేషం సాధకస్య ధనం స్మృతం।**
**వ్యత్యయేనాగతం శేషం సాధకస్య ఋణం స్మృతం।**
**ధనాధికం ఋణం స్వల్పం సర్వసంపత్ప్రదంస్మృతం॥**

**(విశిష్ఠ సంహత)**

విశిష్ట సంహితా కారుడు గృహ నిర్మాణ మొనర్చుటకు గాను గృహ నిర్మాత తాను గృహమును నిర్మించ దలచిన గ్రామవర్గమునకును తన నామవర్గము నకును పై శ్లోకార్థ ప్రకారము చక్కగా ధన ఋణాదులను నిర్ణయముగా తెలుసుకొని తన వర్గమునకు ఋణము కంటే ధనాధిక్యతను గలుగ చేయునట్టి గ్రామవర్గమునందు గృహమును నిర్మించు కోవలసినదిగా వక్కాణించి నిరూపింపబడి యున్నది.

**శ్లో॥ స్వవర్గం ద్విగుణం కృత్వా పర వర్గేణ యోజయేత్।**
**అష్టభిస్తు హరేర్భాగం యోఽధిక స్సఋణీభవేత్॥**

**(జ్యోతిర్నిబంధం)**

**శ్లో॥ స్వవర్గం ద్విగుణం విధాయ పర వర్గాఢ్యం గజై శ్శేషితం। కాకిణ్యస్తనయోశ్చత ద్వివరతోయస్యాధిక సోర్థదః॥**

**(ముహూర్త చింతామణి)**

**శ్లో॥ ద్విఘ్న స్వవర్గస్యయుక్తష్టః।**
**కాకిణికా గజైర్యథ ఇమాయస్యాధిక సోర్థదః॥**

**(ముహూర్త మార్తాండం)**

పై ప్రమాణము లాధారముగా గృహ నిర్మాణ మొనర్చుటకు గాను గృహనిర్మాత, తాను గృహమును నిర్మించదలచిన గ్రామ వర్గమునకు తన నామ వర్గమునకును పై శ్లోకార్థ ప్రకారము గా ధన రుణాలను నిర్ణయించి తన నామవర్గ కాకిణుల కంటే గ్రామ వర్గ కాకిణులు యెక్కువగానున్న గ్రామమున గృహము నిర్మించుకొనుట శ్రేయస్కరమని ప్రతిపాదింపబడినది.

గృహనిర్మాత తాను గృహము నిర్మించుకొను గ్రామ వర్గము నకును తన నామ వర్గమునకును గల ధన ఋణములను లాభ వ్యయములను శుభాశుభములను నిర్ణయము గావించి గృహనిర్మాత తన నామవర్గమునకు అన్నివిధముల యోగ్యముగా ధనప్రదముగా సుఖదాయకముగా శుభఫల ప్రదాయకముగా వున్న గ్రామములో గృహ నిర్మాణము చేసుకొనుటకు ఈ వర్గములు ప్రయోజనకరము లగునని స్పష్టమగుచున్నది. (మిగతా 23 వ పేజీలో)

# నిధి చాల సుఖమా...

## త్యాగరాజ స్వామి కీర్తన శ్రీరామాయణం శ్లోకంతో సమన్వయము




శ్రీమాన్ శ్రీ డా. వోలేటి రవికుమారాచార్య, బీరంగూడా, భాగ్యనగరం

నిధి చాల సుఖమా... అనేది అత్యంత ప్రాచుర్యం పొందిన త్యాగరాజ స్వామి కీర్తనలలో ఒకటి.

తంజావూరు రాజుగారు త్యాగరాజునకు ధన, కనక, వస్తు, వాహనాది సంపదలు పంపించి రాజసభలకు ఆహ్వానించిన సందర్భములో త్యాగరాజు గారు ఆలపించిన కీర్తనే ఇది అనే విషయం మనందరికీ తెలిసినదే. ఇతిహాస పురాణ సంబంధమైన జ్ఞానము లేదా భగవత్ దత్తమైన సహజ జ్ఞానము లేకపోతే ఇటువంటి అత్యద్భుతమైన కీర్తనలు మనకు అందవు.

ఇతిహాస శ్రేష్ఠము అయిన శ్రీరామాయణం అరణ్యకాండ లోని ఒక సందర్భము ఈ కీర్తనకు ఆలంబనమై ఉండవచ్చు అని దాసుడి భావన. అది ఏ సందర్భము అనే విషయాన్ని ఒకసారి పరిశీలిద్దాము.

కైకేయి వరముల కారణంగా ధర్మము అనే పాశమునకు కట్టబడినవాడై దశరథ చక్రవర్తి శ్రీరాముణ్ణి అడవులకు పంపుతాడు.



**“స సత్యవచనాద్రాజా ధర్మ పాశేన సంయతః, వివాసయామాస సుతం రామం దశరథః ప్రియం”** (సంక్షేప రామాయణం 23 వ శ్లోకము)

శ్రీరామచంద్రమూర్తి సీతా లక్ష్మణ సహితంగా అరణ్యమునకు వెళ్లిన సమయంలో భరతుడు అయోధ్యలో లేడు. అతను తన మేనమామ “యుధాజిత్తు” వద్ద ఉన్నాడు. శత్రుఘ్నుడు కూడా భరతుడితోనే ఉన్నాడు. శ్రీ సీతారామ లక్ష్మణులు రథంలో ఆసీనులై దశరథ చక్రవర్తి యొక్క మంత్రి సుమంత్రుడు రథసారథిగా వారిని అరణ్యములకు తీసుకొని వెళుతుండగా ‘రామా వెళ్లొద్దు రామా వెళ్లొద్దు’ అంటూ దశరథ చక్రవర్తి క్రిందపడి దొర్లి దొర్లి ఏడుస్తాడు.

సత్యవాక్ పరిపాలనాదక్షుడు, పితృవాక్ పరిపాలనా దక్షుడు అయినటువంటి శ్రీరామచంద్రుడు రథాన్ని ముందుకు తీసుకుని వెళ్లాల్సిందిగా సుమంత్రుడిని ఆజ్ఞాపిస్తాడు. శ్రీరామచంద్రమూర్తి వెళుతూ ఉండగా అయోధ్యా వాసులూ మరియు దశరథుడూ కొంత దూరం వరకు అనుసరిస్తారు. “పౌరైరనుగతో దూరం పిత్రా దశరథేన చ” (సంక్షేప రామాయణం, 28 వ శ్లోకము).

ఎలాగైనా సుమంత్రుడు శ్రీరామునికి నచ్చజెప్పి తిరిగి అయోధ్యా నగరానికి తీసుకొని రాగలడు అనే నమ్మకంతో దశరథుడు ఉంటాడు. కానీ సుమంత్రుడు సీతారామ లక్ష్మణ సహితంగా తిరిగి రాలేదని తెలుసుకున్న దశరథుడు, ప్రాణాలను విడిచివేస్తాడు. అటు పిమ్మట తన మేనమామ ఇంటి నుంచి భరతుడు తిరిగివచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తాడు. శ్రీరాముడు లేని అయోధ్యను తలుచుకొని తీవ్రమైన దుఃఖంతో ఉన్న భరతుడు తన ముగ్గురు తల్లులను వశిష్ఠాది మునులను వెంటబెట్టుకొని వనములకు వెళ్లి శ్రీరాముడిని ప్రార్థించి ఎలాగైనా తిరిగి అయోధ్యకు తీసుకొని రావాలి అని అను కుంటాడు.

మరి భరతుడు ఇంత మందిని వెంటబెట్టుకొని అడవులకు వెళ్లాల్సిన అవసరం ఏముంది? అంటే భరతుని ఆశ ఈవిధంగా ఉంది. **“ఎన్నారువన్ కణ్ణిల్ కణ్ణనీర్ పొఱుక్కమాట్టాతవర్ అత్తనైపేరాత్తామైకణ్డాల్ మీళాతొళివరో”** (ఒక్క కంటి నీరు సహించలేని శ్రీరామచంద్రుడు ఇంత మంది దుఃఖమును చూచి సహింపగలడా. అంటే.. ఎంతో బాధతో ఉన్న ఒక్క భరతుడి కంట్లో నీళ్లు చూస్తేనే ఏమాత్రం సహింపలేని శ్రీ రాముడు, మరి ఇంత మంది కళ్ళలో నీటిని చూసి సహిస్తాడా? ఎలాగైనా తప్పక అయోధ్యకు వస్తాడు అని భరతుడి ఆశ.) భరతుడు ఎన్నో విధాలుగా శ్రీరాముడికి నచ్చజెప్పి అయోధ్యకు తిరిగి రావాల్సిందిగా ప్రార్థిస్తాడు. కానీ శ్రీరాముడు ఎంత మాత్రం ఒప్పుకోడు. ఆ సందర్భంలో భరతునితో శ్రీరాముడు ఈ విధంగా అంటాడు.

**"సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్చయాః, సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితం"** (అయోధ్యాకాండ 105 వ సర్గ, 16 వ శ్లోకము). ఈ శ్లోకం యొక్క అర్థం ఏమిటంటే ధన సంచయములు అన్నియు నాశము పర్యవసానముగా గలవియే. మిక్కిలి ఎత్తుగా పెరిగినవి కూడా పతనము అంతముగా గలవియే. సంయోగములు (కలియుట) వియోగము (విడిపోవుట) అంతమునందు గలవియే జీవితము కూడా మరణము అంతమునందు గలదియే.

మొత్తం మీద తాత్పర్యం ఏమిటంటే కూడబెట్టిన ధనము అంతా రాజుల పాలో, దొంగల పాలో, అగ్ని పాలో లేదా కామము వలన నశించటమో ఎదో విధముగా చివరిలో నశించేదే. ఐశ్వర్యము శాశ్వతము కాదు. పెరుగుట విరుగుట కొరకే, కొంత కాలం కలిసి ఉన్నప్పటికీ కలిసినవన్నీ విడిపోక తప్పదు. అంటే భార్య భర్తలు లేదా బంధు మిత్రులు ఎంత ఆప్యాయముగా ఉన్నప్పటికీ ఏదో ఒక సందర్భములో విడిపోవాల్సిందే. అందరూ ఒకరోజున వెళ్ళిపోవాల్సిందే.. చివరకు మరణంతోని జీవితం ముగుస్తుంది.

**"నిధి చాల సుఖమా. రాముని సన్నిధి సేవ సుఖమా"**

ఇంతకీ అసలు విషయానికి వస్తే, శ్రీరాముడు భరతునికి చేసిన ఇట్టి బోధ త్యాగరాజ స్వామి వారికి చాలా స్పష్టంగా అర్థమయింది అనిపిస్తుంది (ఇది దాసుని భావం మాత్రమే), త్యాగరాజ స్వామి వారి యొక్క కీర్తన మరియు భావం ఒకసారి పరిశీలిద్దాము.

**నిధి చాల సుఖమా.... రాముని సన్నిధి సేవ సుఖమా.... నిజముగ పల్కు మనసా.... నిధి చాల సుఖమా**

**దధి నవనీత క్షీరములు రుచియో, దాశరథి ధ్యాన భజన సుధా రసము రుచియో... నిధి చాల సుఖమా...**

భావం: నశించే స్వభావము కల ఈ నిధి (సంపద), భోగములు మరియు వాహనాదులు సుఖమా లేదా ఆనంద స్వరూపుడు, శాశ్వతుడు, అవ్యయుడు అయిన ఆ శ్రీరాముని సన్నిధి సుఖమా... ఓ మనసా నిజము చెప్పుమా.... ఏది సుఖము?

పెరుగు, వెన్న, పాలు ఇట్టి వాటితో చేసిన పదార్థాలు భోగ్యమైనవిగా రుచికరమైనవిగా లోకంలో ఉండే జనులు భావిస్తున్నారు.... ఓ మనసా... నిజంగా ఈ పదార్థాలు రుచియా... లేదా.... శ్రీరామచంద్రుని భజించుట, కీర్తించుట ద్వారా అనుభవవేద్యమైన అమృతరసము రుచియా....అంటూ సాగే ఈ కీర్తనకు శ్రీరామాయణం అరణ్యకాండలోని **"సర్వే క్షయాంతా నిచయాః"** అనే పై శ్లోకార్థము సమన్వయము చేయుటలో ఏ అడ్డు లేదు కదా.....

ప్రియ బంధు మిత్రులారా..... వాగ్గేయకారులు అందించిన ప్రతి కీర్తనలో ఎన్నో గొప్ప అర్థాలు ప్రకాశిస్తాయి. అట్టి కీర్తనలు సాధారణమైన లౌకిక అర్థాలను ప్రతిపాదించేవి అని అనుకోకూడదు. వేద, ఇతిహాస, పురాణ, ప్రబంధాల్లోని నిగూఢమైన విషయాలను సులభమయిన రీతిలో అందించి అట్టి అర్థాన్ని మనం గ్రహించేలా చేసి ఆ పరమాత్మ వైపుకు మనల్ని నడిపించటమే వాగ్గేయకారుల కీర్తనలోని గొప్పతనం.

**(త్యాగరాజ ఆరాధనోత్సవాల సందర్భంగా ప్రత్యేకం)**

# గోదాం భక్తావనాం శ్రియం

**శ్రీమాన్ శ్రీ చిలకమఱ్ఱి కృష్ణమాచార్యులు, కోదాడ**



నీళాప్రణయపీయూష
పానవిశేషమత్త ము
ద్భోధ్యకృష్ణం నమామ్యహం
గోదాం భక్తావనాం శ్రియం

శ్రీవిష్ణుచిత్త సౌభాగ్యాం
తులసీ వన సంభవాం
ఆముక్తమల్యదాం దేవీం
గోదాం వందే హరిప్రియాం

దాసజనైక సంరక్షాం
శ్రీవ్రతదాయినీం శుభాం
పరాత్పర కృపాదేయాం
గోదాం వందే హరిప్రియాం

వేదార్థభావ సంధాత్రీం
సందేహ తిమిరాంతకాం
నందనందన సౌందర్యాం
గోదాం వందే హరిప్రియాం

శ్రీధన్విపుర భాగ్యదాం
మోక్షమార్గ ప్రదర్శినీం
రంగనాథ దయాపాత్రీం
గోదాం వందే హరిప్రియాం

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) **ద్వార వాస్తు**

గృహ నిర్మాణ విధానమును గురించి మన ప్రాచీన ఋషులు పండితులు గృహ నిర్మాణ విధానమును, నిర్మాణ విధానములో ప్రతి అంశమును శాస్త్రీయ విధానముగా పరిశీలించారు. ఆయా అంశముల వలన మానవ జీవనంలో ఏది ప్రధానము? అసలు జీవితములో ఏది ప్రధానము? అని నిశిత పరిశీలన చేసారు. జీవితములో చదువు, ఆరోగ్యం, ధనము, అధికారము, సంతానము, ఆయుష్యము, ఇవన్నీ జీవితములో అవసరమే! ఇవన్నీ జీవితంలో భాగాలే. అసలు జీవితములో ప్రధానమైన అంశం ఏది? అని వారు పరిశీలించి నిర్ణయించిన విషయము. జీవితమంటే సంతోషం, ఆనందం, ప్రశాంతత, ఉత్సాహం. ఇలాంటి విషయాలను పరిశీలించి ఇవి ఎలా అందుతాయి? అందడానికి గృహ నిర్మాణంలో ఏవేవి ఎలా చేయడం ద్వారా సుస్థిర ప్రశాంతత లభిస్తుంది. అసలు గృహానికి, నివసించే మానవులకు సంబంధం ఏమిటి? అసలు శరీర నిర్మాణానికి, గృహ నిర్మాణానికి ఎలా పోలిక అన్వయం చేయాలి? అని వారు మానవ శరీర నిర్మాణాన్ని పోలుస్తూ గృహ నిర్మాణ ప్రక్రియా విధానమును ప్రారంభించినట్లు మనకు "విశ్వకర్మ" వాస్తు గ్రంథం ద్వారా అవగత మవుతుంది.

ఒక మానవ శరీరాన్ని బోర్లా పడుకోబెట్టి శరీరాన్ని పరిశీలించారు. గృహ నిర్మాణాన్ని ప్రాచీనంలో కర్రతో, మట్టితో, తాటి కమ్మలతో వేసే గుడిసెలకు గూడా ఇదే దేహ సూత్రాన్ని పాటించారు. గమనించగా తేలిన విషయము. మనిషి శరీరంలో గల వెన్ను పూస ఎముకనే వెనుగ్ర. ప్రక్కన వెనుపూసను అనుసరించియున్న ఎముకలే వాసాలుగా, దేహాన్ని నిలుపగల కాళ్ళు, చేతులే ఎముకలే గృహమును నిలుపు స్థంభాలుగా, ఎముకల చుట్టూ గల మాంస కండరములే గోడలకు వాడు మట్టిగా, శరీరమునకు గల రంధ్రములను ద్వారములుగా. ఉదాహరణ ముఖమునకు గల నోటిని ముఖ ద్వారమని, దానిపై గల నాసికను, నేత్రములను గవాక్షములు (కళ్ళు) అనగా గాలి, వెలుతురు ప్రసరించు కిటికీలు, వెంటిలేటర్లుగా, దేహానికి పైన రక్షణగా యుండు చర్మమే ఇంటికి మట్టి పూతగా, ఈ దేహ నిర్మాణ సూత్రమును బట్టి గేహ (గృహ) నిర్మాణమును చేపట్టినారు. దేహమునకు గల సర్వ అవయవ సంపద ఆరోగ్యముగా వుంటే అందు జీవుడు ప్రాణము సంచరిస్తుంది. అలాగే గృహము శాస్త్ర విధానంగా నిర్మాణము సాగితే అందులో నివసించు మానవులు సుఖ శాంతులతో ఉండగలరని ప్రాచీనులు వాస్తు శాస్త్ర ఆధారముగా నిర్మాణాలు చేపట్టినారు. దీని వలన మానవునికి అన్ని సమపాళ్లలో అందాలి అని ఆరోగ్యం, ఉత్సాహం, సంతానం, విద్య, విజ్ఞానం, సంపదలు, ఆయుష్యం, ప్రేమాదరములు, గౌరవ మర్యాదలు ఇవి అన్ని మనిషి కోరుకొనేవే. ఇవి అన్ని సమంగా అందాలి. ఒక చెట్టుకు చెట్టు మొదట నీరు పోసి, ఎరువు వేస్తే, చెట్టుకు కాండము, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు పండ్లు ఎలాగ వాటంతట అవే వస్తాయో! మానవ జీవితంలో అన్ని రకాల సంపదలు, సంతోషాలు రావాలంటే శాస్త్రాన్ని అనుసరించి నివాస నిర్మాణాలు చేయాలి. తద్వారా మానవజీవితంలో ఈ లోకంలో పొందగల సంపదలు సాధించుకునే బుద్ధి, శక్తి సామర్థ్యాలు మానవునికి గృహ నివాసం ద్వారా లభిస్తాయని ప్రాచీనులు సిద్ధాంతం చేశారు. దానిని అనుసరించి నిర్మాణములు చేసి అందు నివసించి మన ప్రాచీనులు ఆయురారోగ్యములతో సుఖ శాంతులు పొందారు.

( వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాం)

భరన్యాసము

# భగవంతుని పైనే భారము...

శ్రీమతి వంగల రాధిక



శరణాగతి అంటే ఆత్మ వేరు శరీరము వేరు అని తెలుసుకొని, ఆత్మోజ్జీవనానికై జీవించడము! దానికి అర్హత పొందడమే సమాశ్రయణము!

**"పితా చ రక్షకశేషీ , భర్తాయో రమాపతిః,**

**స్వామ్యాధారో మమాత్మాచ , భోక్తా !"** అని నవ విధ సంబంధము నారాయణునితోనే! ఇహలోకములోని బాంధవ్యాలు పరిమితమైన పరిధిలోనివే! **"ఒరవు మట్రారుమిల్లై" "పెట్రత్తాయిన ఆయిన శెయ్యుం"** అని ఎన్నో రకాలుగా చెప్తారు ఆళ్వారులు! శరణాగతి చేసిన ప్రపన్నుడు ఎలా నడచుకోవాలి? అన్న విషయాన్ని ఎన్ని శ్లోకాలలో చెప్పారు అనగా శరణాగతిని చెప్పడానికి, శరణాగతి వివరణ, శరణాగతి ఫలశృతి, శరణాగతి ఆచరణ, అన్నీ కలిపి శరణాగతి అనుష్ఠానం! మొత్తం మీద నివృత్తి మార్గము! ఇదీ న్యాస దశకం! వివరణలోనికి వెళ్ళి ఆనందసాగరమైన ప్రపత్తిసాగరములో మునుగుదాము.

మనము ఇప్పటి వరకు వేదాంతదేశికుల వారి న్యాస దశకపు పేటికా విభాగము చూసాము. అసలు శరణాగతి అంటే ఏమిటి? శరణాగతి శాస్త్రము ఏమి వివరిస్తుంది? దాని ఫల ప్రార్థన! మనము దానిని ఎలా ఆచరించాలి? ఇలా అన్నీ తెలుసుకొన్న తరువాత చిట్ట చివరగా మనము ఎలా వుండాలి? అనేది తెలుస్తుంది. **"నిర్భయో నిర్భరోస్మి!"** అర్జునుడు యుద్ధారంభంలో భోరుమని ఏడ్చాడు. **"అహం త్వా సర్వపాపేభ్యో మోక్ష ఇష్యామి"** అంటూ! కన్నయ్య అభయమిచ్చేసారు! ధైర్యంగా యుద్ధం చేసాడు అర్జునుడు! మనము? **"నమ్మన్ పోలే వీళత్తముక్కుం నాట్టినుళ్ళ పావమెల్లాం, చుమ్మనాదే కైవిట్టోడి తూర్గళ్ పాయ్ న్దనవే"** మన స్వరూపము శేషత్వమనే జ్ఞానము తెలిసి, మన యజమాని పరమాత్మ అని తెలియగానే, ఆ పాపాలన్నీ, "భీభ్రతి" భయపడిపోయి, ఎక్కడ సందుదొరికితే అక్కడ దూరి వున్న చోటు తెలియకుండా పారిపోయాయి అంటున్నారు ఆళ్వారు! పాపభీతి ఎగిరిపోయింది. **"పణ్ణన్ను పట్టిణం కాప్పే"** పరమాత్మయే నాకు రక్షకుడిగా వుండగా **"అచ్చుమెనక్కిల్లై!...అచ్చుమెనక్కిల్లై!...అచ్చుమెనక్కిల్లై"** ఇంక మనకు భయమెక్కడిది? నిర్భయో! నిర్భరోస్మి! నిబ్బరంగా మనము వున్నాము! ఇంతకాలము ఆత్మ ఉజ్జీవనము మనబాధ్యత అని అనుకొన్నాము! న్యాసదశకం పారాయణ తో ఆ బాధ్యత మన యజమానిదని తెలుసుకొన్నాము! అంతే! భారం తీరిన వానిగా మనస్సు తేలికపడి పోయింది!

ఆప్రకారము జీవనాన్ని మలచుకొని, హాయిగా గుండె మీద చేయి వేసుకొని, పరమాత్మ పిలుపు కోసము వేచి వుండే వారమవుతాము! న్యాస దశక సారాన్ని ఒక్కసారి పునరావలోకనం చేసుకొందాము.

1 వ శ్లో॥ శరణాగతి ఏమిటి? 2,3 వ శ్లో॥ శరణాగతి అనుష్ఠానం ( ద్వయమంత్ర పూర్వఖండం), 4 వ శ్లో॥ ఫలప్రాప్తి / కైంకర్య ప్రార్థన ( ద్వయమంత్ర ఉత్తర ఖండం) ఇంత వరకు అనుష్ఠాన క్రమం 5, 6, 7, 8 శ్లో॥ పైనాలుగూ తెలుసుకొని మనలను మనము ఎలా మలచుకోవాలి? మనము ఎలా నడచుకోవాలి? అనుసరించుట, అనుసరణ క్రమం 10.శ్లో॥ నిర్భరోస్మి! భయమువీడి భరన్యాసముచేసి నిర్భయముగా వుండుట. ఆఖరిశ్లోకం ఈ న్యాసదీక్షను మనకు ఇచ్చిన దేశికులవారి స్తుతి. కాంచీపురములో వెలసిన దేవపెరుమాళ్ళకి ఈ న్యాసదశకాన్ని కావ్యాంజలిగా సమర్పించారు వేదాంత దేశికులు. అభీష్ట వరదః అనే 4 వ శ్లోకములో ఈ విషయము తేటతెల్లమవుతోంది. **అహం మద్రక్షణభరో, మద్రక్షణ ఫలం తథా! నమమ శ్రీపతేరేవ, ఆత్మానం నిక్షిపేత్ బుధః॥** బుధః జ్ఞానులు శాస్త్రాలను శాస్త్రార్థాలను తెలుసుకొని, ఆచార్యులవద్ద సద్జ్ఞానమును పొందినజ్ఞానులు. ఏమంటారువారు? అహం నమమ శ్రీపతే రేవ నేను నాకుచెందిన వాడిని కాను! పరమాత్మసొత్తును! **మద్రక్షణభరః నమమ శ్రీపతేరేవ** అందువల్ల నా రక్షణభారము నాది కాదు! శ్రియః పతియైన పరమాత్మదే! మద్రక్షణ ఫలం నన్ను రక్షించిన దాని ఫలము! అదీ నమమ నాదికాదు! శ్రీపతేరేవ! శ్రియఃపతి యైన స్వామిదే! **ఇతి ఆత్మానం నిక్షిపేత్** ఇలా తమ (మిగతా 22 వ పేజీలో)

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు




**శ్రీమతి తిరుమల నీరజ**

(క్రిందటి సంచిక తరువాయి)

కృతయుగంలో బ్రహ్మదేవుడు, ప్రజాసృష్టికి నియోగించడం వల్ల కర్దముడు ప్రజాపతి అయ్యాడు. ఎంతో సంతోషంతో ఆయన సరస్వతీనదీతీరంలో పదివేల దివ్యసంవత్సరాలు ఏకాగ్రతతో తపస్సు చేశాడు. కర్దమునికి వరదుడు, మనోరథాలు తీర్చేవాడు, దేవతల పూజలు పొందేవాడు ఐన శ్రీలక్ష్మీనాథుడు ప్రత్యక్ష మయ్యాడు. ఆ స్వామిని దర్శించిన హర్షపారవశ్యంతో కర్దముడు ఆ శ్రీహరికి సాష్టాంగ దండప్రణామాలు చేశాడు. ఎన్నో విధాల స్తుతించాడు.

హరి సంతోషించి, "ఓ మునీంద్రా! ఏ కోరికను మనసులో పెట్టుకుని నన్ను భక్తితో పూజించావో ఆ కోరిక తప్పకుండా తీరుతుంది" అన్నాడు. అంతే కాకుండా "ధాత కుమారుడు, సమ్రాట్టు ఐన స్వాయంభువమనువు భూమండల మంతటినీ బ్రహ్మావర్తదేశాన్ని రాజధానిగా పరిపాలిస్తున్నాడు. ఆయన, శతరూప అనే తన భార్యను, వివాహం కావలసిన తన పుత్రికను వెంటపెట్టుకుని రేపు నీ దగ్గరికి వస్తాడు. రూపం, వయసు, శీలం, గుణాలలో నీకు అనుకూలవతి ఐన ఆ కుమార్తెను నీకిచ్చి పరిణయం చేస్తాడు. నీ మనసు లోని కోరిక తీరుతుంది. నన్ను నీ చిత్తంలో నిరంతరం స్మరిస్తూ ఉండు.



"ఆ మనుకన్య నీ వల్ల అత్యంత సౌందర్యవతులైన తొమ్మండుగురు కుమార్తెలకు తల్లి అవుతుంది. వారందరికీ మునీంద్రుల వల్ల పుత్రులు పుడతారు. నీవు నా ఆజ్ఞానుసారం చేసే అన్ని పనులూ నాకు సమర్పిస్తూ, దయతో దానాలు చేస్తూ జ్ఞానివై ప్రవర్తించు. చిట్టచివర నన్ను పొందుతావు. చివరి దశలో నేనే నీకు నా కళతో పుత్రుణ్ణై జన్మించి నీకు తత్త్వబోధ చేస్తాను" అని అనుగ్రహించి, శ్రీహరి అంతర్హితు డయ్యాడు.

ఆ తర్వాత మనసులో కోరికలు గుబులుకోగా, కర్దముడు బిందుసరోవరానికి వెళ్ళి, అక్కడ పరమభక్తితో ఇందిరానాథుణ్ణే స్మరిస్తూ ఉన్నాడు.

ఇంతలో స్వాయంభువమనువు భార్యాపుత్రికలతో కలసి బంగారు రథం మీద అక్కడికి వచ్చాడు. పుణ్యతీర్థమై వెలసిన ఆ బిందుసరోవరాన్ని మనువు సందర్శించాడు. కర్దముణ్ని మహావిష్ణువు దయతో, ఆనందంతో తిలకించినప్పుడు, ఆ స్వామి నయనకమలాల నుండి నేల పైకి రాలిన బాష్పాలు సరస్వతీనదిని వలయాకారంలో చుట్టుకుని పారాయి. అదే 'బిందుసరోవరం' అనే పేరుతో పుణ్య తీర్థంగా ఖ్యాతి కెక్కింది.

ఆ సరోవరం సమీపం లోనే కర్దమముని తపోవనం ఉంది. ఎంతో చక్కగా అలరారుతున్న కర్దమ మునీంద్రుని ఆశ్రమాన్ని చూసిన మనువు, అతి తక్కువ పరిజనంతో లోపలికి వెళ్లాడు. తపోవృత్తి చేత కృశించి ప్రకాశిస్తున్న ఆ మునీంద్రుని పాదాలకు భక్తితో నమస్కరించాడు.

వారిని తగిన విధంగా సత్కరించిన కర్దముడు, శ్రీహరి ఆదేశాన్ని తలచుకుని మనువుతో ఇట్లా అన్నాడు. "ఓ ప్రజాపతీ! మీ రాకకు హేతు వేమిటి?"

అప్పుడు మనువు, "బ్రహ్మదేవుడు తాను చెప్పిన వేదసమూహాల వ్యాప్తికి పండితులైన మిమ్ములను తన ముఖం నుండి సృష్టించాడు. దుర్జనులైన చోరుల బారిన పడకుండా ఈ క్షోణిని భూమి పాలించటానికి తన భుజాల నుండి మమ్ములను సృష్టించాడు. అంతఃకరణంగా బ్రాహ్మణులు, శరీరంగా క్షత్రియులు ఈ ఇరువురూ శ్రీలక్ష్మీనాథుడు తప్పకుండా కాపాడవలసినవారు. నిన్ను దర్శించడ మనేది నా అదృష్టం. నేను కృతార్థుడి నయ్యాను. నా పుత్రికపై ఉన్న స్నేహం చేత ఆందోళన పడుతూ దేశాలన్నీ తిరిగాను. బాధతో

ఉన్న నా విన్నపాన్ని అవధరించు" అని కోరాడు. "ఓ యోగీశ్వరా! ఈమె దేవహూతి అనే పేరున్నది. నా కుమార్తె. ఎందరో సౌందర్యవంతులైన గుణాఢ్యులను గురించి విన్నప్పటికీ, ఎవరినీ ఇష్టపడటం లేదు. నారదదేవర్షి వల్ల నీ రూపరేఖాగుణాలు ఆలకించి, నిన్నే వివాహం చేసుకోవాలనే సంకల్పంతో ఇక్కడికి వచ్చింది. ఈ తరుణీభిక్షను స్వీకరించి ఈ శుభకార్యానికి అంగీకారం తెలుపు" అని చెప్పాడు.

అప్పుడు కర్దముడు ఎంతో సంతోషంతో మనువుతో ఈ విధంగా అన్నాడు. "అనఘా! మరెవ్వరికీ ఇవ్వకుండా నాకే ఇద్దా మనే ఉద్దేశ్యంతో తీసుకువచ్చిన ఈ లతాంగి మహాలక్ష్మితో సమానం. ఈమెకు సంబంధించిన విషయం ఒకటి చెబుతాను, విను. ఒక పున్నమి నాటి రాత్రి నిండు వెన్నెలలో ప్రకాశిస్తున్న తన సౌధం మీద సఖీజనంతో కలసి ఈమె కందుకక్రీడ బంతి ఆటలో ఉంది. ఆ సమయంలో ఆకాశంలో విమానంలో వెళుతున్న విశ్వావసు డనే గంధర్వరాజు ఈ తరుణీమణిని చూసి మోహించి, తూలి నేలపై పడ్డాడు. దామోదరుడైన ఆ విష్ణుస్మరణ లేని వాడెవడూ ఈ సుందరిని చూడలేడు. అటువంటి జవ్వని తనంతట తానే వలచి వస్తే తిరస్కరించేవాడు ఉంటాడా? ఈ కన్యకారత్నానికీ, నాకూ రూపగుణప్రవర్తనలు సమంగా ఉన్నాయి. అందుచేత నిర్మలమనస్సుతో ఈమెను వరిస్తాను. ఐనా దీనికి ఒక నియమం ఉంది. సద్గుణవతి ఐన ఈమెకు సంతానం కలిగేంతవరకు మాత్రమే నేను గృహస్థుగా ఉంటాను. ఆ పైన ఉల్లంఘించ కూడని మహావిష్ణువు ఆజ్ఞ మేరకు, శమదమాది యోగమార్గంలో సన్యాసాశ్రమం స్వీకరిస్తాను."

మనువు తన భార్య తోను, దేవహూతి తోను సంప్రదించి, కర్దమప్రజాపతికి దేవహూతితో పరిణయం శాస్త్రోక్తంగా జరిపించాడు.

దేవహూతి తన సమస్తమూ తన భర్తే అని విశ్వసించి, ఆయనకు సేవ చేయసాగింది. ఆమె పరిచర్యలకు ఆనందించిన కర్దముడు ఆమెకు దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆమె కోరిక మీద ఒక దివ్యవిమానాన్ని, తన యోగమాయాశక్తితో సృష్టించాడు. దివ్యకన్యలు దేవహూతికి మంగళస్నానం చేయించారు. ఎంతో సుందరంగా ఆమెను అలంకరించారు. తన భర్త మాయాశక్తికి విస్మితురాలైంది దేవహూతి. వంద ఏళ్లు ఆ విధంగా సుఖభోగాలతో గడపిన పిమ్మట, దేవహూతికి తొమ్మిదిమంది కుమార్తెలు కలిగారు. ఆ పైన కర్దమముని సన్యాసం తీసుకోదలచాడు. దేవహూతి, "స్వామీ! సంతానం కలిగేవరకూ నాతో కలసి ఉంటానని పూర్వం పలికావు. ఇప్పు డీ పుత్రికలకు తగిన భర్తలు కావాలి కదా! వాళ్లే ఎట్లా వెదుక్కోగలరు? కాబట్టి వీరికి సరిపోయే భర్తలు దొరికిన తర్వాత, నాకు తత్త్వసంహితను బోధించే కుమారుణ్ని ప్రసాదించి నన్ను కరుణించు. ఇంతవరకూ చపలచిత్తంతో ఏవేవో కోరాను" అని వేడుకున్నది.

అప్పుడు కర్దమముని, "ఓ మనుపుత్రీ! దుఃఖించకు. త్వరలోనే భగవంతుడు, అనఘుడు, అక్షరుడు ఐన పరమాత్మ నీ గర్భం లోనికి చేరుతాడు. ఉత్తమవ్రతాలు చేస్తూ శ్రద్ధాభక్తులతో దానధర్మాలు చేయి. ఆ మాధవుని చరణకమలాలను భక్తితో పూజిస్తే ఆ పురుషోత్తముడు సంతృప్తి చెంది, నీ గర్భం లోనికి ప్రవేశించి నీ మనసులో కలిగిన శంక లన్నిటినీ నివారిస్తాడు" అని చెప్పాడు.


సంతోషించిన దేవహూతి మునీంద్రుడు చెప్పినట్లే శ్రీమహావిష్ణువును పూజిస్తూంటే, కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. ఆ హరి జమ్మిచెట్టు తొర్రలో నుంచి అగ్ని ఉదయించినట్లుగా, ఆ తరుణికి జన్మించాడు. అప్పుడు గగనంలో దేవవాద్యఘోష చాలా పెరిగింది. దేవబృందాలు మందారకుసుమవృష్టి కురిపించారు. గంధర్వులూ, కిన్నరులూ గీతాలు ఆలపిస్తే, అచ్చరలేమలు నాట్యాలు చేశారు. సాధువుల మనస్సులలో సంతోషం వెల్లివిరిసింది. హోమాగ్నులు అధికతేజస్సుతో జ్వలించాయి. వృక్షాలన్నీ కుసుమఫలాలతో బరువై వంగాయి. అన్ని పంటలూ సమృద్ధంగా ఫలించాయి. (సశేషం)

**ఆధ్యాత్మిక రచయితలకు, కవులకు..స్వాగతం :** సమాజ హితానికి, ఆత్మోజ్జీవనానికి మార్గాన్ని చూపిస్తూ వెలుగులు నింపే ఆధ్యాత్మిక, శాస్త్ర, ఇతిహాస పురాణ వైదిక ధర్మ విశేషాలను, రచనలను మాకు పంపండి. ఆధునికులనూ, సామాన్యులనూ ఆలోచింపచేసే రచనలు మాకందించండి.. శ్రీసన్నిధానం మాస పత్రిక ద్వారా పాఠకలోకానికి అందిద్దాం !...

## శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము

# అఖిల భువన జన్మ...

శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు



(క్రిందటి సంచిక తరువాయి)

ఈ శ్లోకంలో దాదాపుగా పది మతాల నిరసనం ఉంది. **"అఖిల భువన జన్మ స్థేమ"** అని సమస్త జగత్తునకు సృష్టిస్థితి లయలు పరమాత్మే చేస్తున్నాడు అని చెప్పడం వలన **"యుగపత్ సర్వసృష్టి" యుగపత్ ప్రళయం"** అనేది భాస్కర ప్రభాకరాది మీమాంసకులు అంగీకరించరు. అందుచేత సృష్టిస్థితి లయలు పరమాత్మ ఏక కాలంలో చేస్తాడని చెప్పడం చేత భాస్కర ప్రభాకరాది మీమాంస మతాలు గర్హించబడ్డాయి.

**అఖిల భువన జన్మ స్థేమ భంగాది లీలే**
**వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే ।**
**శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే**
**భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥**


హిరణ్యగర్భ మతం దాన్ని యోగ శాస్త్రం అంటారు. పరమాత్మ సాక్షి భూతంగా మాత్రమే ఉంటాడని ఆయనకు దీనితో సంబంధం లేదు అని వీరు చెప్తారు. కానీ ఈ శ్లోకంలో 'లీలే' అన్నారు. అనగా ఆ ఆనందం పరమాత్మదే! అంటున్నారు. కనుక హిరణ్య గర్భ మతం యోగ శాస్త్రం నిషేధించ బడింది. **"వివిధ భూత వ్రాతం"** అని జీవాత్మ రకరకాలుగా ఉన్నారని పరమాత్మ జీవాత్మ వేరు వేరనీ చెప్పడం ద్వారా అద్వైత మతం ఖండించబడింది. అద్వైతంలో జీవాత్మ పరమాత్మకు భేదాన్నంగీకరించరు. ఆత్మల్లో కూడా పరస్పర భేదాన్నంగీకరించరు. **"వివిధ భూత వ్రాత"** అని ఈ మతం ఖండించబడింది. **'రక్షైకదీక్షే'** అని **"శృతిశిరసి"** అని చెప్పడం వలన వేదాన్ని అంగీకరించని నాస్తికులైన చార్వాక జైనాది మతాలు ఖండించ బడ్డాయి. పరమాత్మను సిద్ధింప చేసుకొనుటకు శాస్త్రమేగాక అనుమాన ప్రమాణంతో కూడా సిద్ధింప చేయవచ్చు **'క్షిత్యంకురాదికం కర్తృజన్యం కార్యత్వాత్ ఘటవత్'** భగవత్ ప్రపంచ సృష్టి అది కార్యం కాబట్టి కావాలంటే కర్తృజన్యం ఊహించవచ్చు. అనుమానిక ప్రమాణం చేత సిద్ధింప చేయవచ్చు అంటారు అనుమానిక సిద్ధవాదులు, " శృతి శిరసి" అని చెప్పడం వలన అనుమానిక వాదం ఖండింపబడింది. **'పరస్మిన్ బ్రహ్మణి'** సృష్టి స్థితి లయలు చేయడం పరమాత్మకు ఆనందం అని పరమాత్మ సంబంధం అని చెప్పడం వలన... పరమాత్మ సంబంధం లేకుండా సృష్టి జరుగుతుంది.

**"సృష్టి స్థితి లయాదులకు మూల ప్రకృతి కారణం"** అంటారు సాంఖ్యులు. ఇవన్నీ పరమాత్మ చేస్తున్నాడని చెప్పడం వలన పరమాత్మ కర్తృత్వమే కాని మూల ప్రకృతి కాదు అని ఖండించబడినది. మరి కొంతమంది తార్కికులు పరమాణు కారణం అంటారు "శృతి శిరసి" అని చెప్పడం వలన పరమాణు కారణం కాదు అని ఖండించ బడింది. 'బ్రహ్మణి శ్రీనివాసే' అని చెప్పడం వలన పరమాత్మకి సృష్టి స్థితి లయలు కర్తృత్వం ఉన్నది తప్ప మిగతా వారికి లేదు అనిచెప్పబడింది. ఇతరమైన దేవతలను శైవ పాశుపతాదులు సరైనవి కావని చెప్పబడినది. తర్వాత "శేముషి" అన్నారు. అనగా జ్ఞానము, జ్ఞానము చేతనే మోక్షము అని ఉపనిషత్ వాక్యము "జ్ఞానాన్ మోక్షః" అని. 'జ్ఞానకర్మ సముచ్చయం' అంటారు. జ్ఞానము కర్మ రెండింటిని ఒక గుంపు అంటారు. కాని ఇక్కడ కేవల జ్ఞానము అని చెప్పడం వలన భాస్కర మతం ఖండించబడింది. "భక్తిరూపా" అన్నారు. కేవల జ్ఞానము మాత్రమేకాదు. అది ఉపాసనాత్మక జ్ఞానం అన్నారు. శంకరమతంలో "తత్వమసి" అని వాక్యార్థ జ్ఞానమే కారణము అన్నారు. వీరు ఉపాసనాత్మకం జ్ఞానం అన్నారు. కనుక ఆ మతమూ ఖండించ బడ్డట్టుగా చెప్పబడింది.

ఈవిధంగా పది రకాల మతాలను ఖండించినట్టుగా అయింది. ఈ విధంగా ఈ శ్లోకానికి శుకప్రకాశకాచార్యులు ఐదు పేజీల వ్యాఖ్యానం రాస్తే, వేదాంత దేశికుల వారు '20' పేజీల తత్వటీకా అనే దాంట్లో పదిరకాలుగా రాశారు. అటువంటి గొప్ప ప్రతిభావంతమయినది ఈ మంగళాచరణ శ్లోకము. (సమాప్తం)


(ఉభయవేదాంత సభలోని ప్రసంగము ఆధారంగా) ★

# చక్కని చుక్కల ముగ్గులు



శ్రీమాన్ శ్రీ డాక్టర్ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

చుక్కలను పెట్టి ముగ్గును వేయడం అనే విషయం మనకు అందరకు తెలిసినదే. దీనికి కొంచెం ఏకాగ్రత, శ్రమ మాత్రమే ఆవశ్యకం. స్వామి తిరువీథిలోకి వేంచేయబోతాడు అంటే, వాకిలిని ఊడ్చి, నీళ్లు జల్లి, ముగ్గును పెట్టడం అలవాటు. చుక్కలను పెట్టి, వాటిని చక్కగా ముగ్గును దిద్దడానికి ఒక గంట సేపు పట్టవచ్చు. ఆ తరువాత ఆ ముగ్గుకు రంగులను పూస్తే, ఆ ముగ్గు ఇంకా అందంగా ఉంటుంది. పల్లకి మీద స్వామి వేంచేస్తే పల్లకి ఆకారంలో ముగ్గును, ఏనుగు మీద స్వామి వేంచేసినప్పుడు ఏనుగు ఆకారంలోని ముగ్గును. రథం మీద స్వామి వేంచేస్తే రథం ఆకారంలోని ముగ్గును వేయడం అలవాటు. ఈ విధంగా ఎన్ని ఆకారాలలోనో ముగ్గులు వేస్తారు. ముగ్గు వేయడానికి ఆరంభించి నప్పుడు, మొదట చుక్కలు పెడతారు. నిర్దిష్టమైన క్రమంలో, సంఖ్యలో చుక్కలను పెట్టడం ఆ చుక్కలను ఒక క్రమ రీతిలో కలపడం, ఇవన్నీ ఉన్నప్పుడే ముగ్గు ఆకారం ఏర్పడుతుంది. ముగ్గు పూర్తి అయినప్పుడు చుక్కలు కంటికి గోచరించవు. ముగ్గు మాత్రమే కనిపిస్తుంది.



ముగ్గుకు ద్రావిడ భాషలో కోలం అని పేరు. కోలం అనే పదానికి అందం అని కూడా ఆ భాషలో అర్థం ఉన్నది. "కోలవరాహం" అని ఆళ్వారులు వరాహావతారాన్ని కీర్తిస్తారు. అంటే, అందమైన వరాహస్వామి అని అర్థం. ఇంకొక చోట వారే, "ఉన్ కోలమేని కాణ వారాయ్" (నీ అందమైన దివ్య మంగళ రూపాన్ని దర్శించేటట్లుగా రావాలి) అని అంటారు.

ఈ ముగ్గును పెట్టడానికి ఆరంభించినప్పుడు, చుక్కలను పెట్టిన సమయంలో, ఆ చుక్కలు మనసును ఆకర్షించవు దృష్టిని ఆకట్టుకోవు. ఏమీ అర్థం కాదు. ముగ్గుగా తీర్చిదిద్దిన తరువాత, ముందు పెట్టిన చుక్కలు కనపడవు కానీ, ముగ్గు మాత్రం దృష్టిని, మనసును ఎంతో ఆకర్షిస్తుంది. ఆ ముగ్గుకు రంగులను పూస్తే, ఆ ముగ్గు మనసును కొల్లగొడుతుంది. దానిని గమనించినప్పుడు కూడా ఏదో అర్థం అయినట్లు అనిపిస్తుంది. ఇది అంతా దేన్ని సూచిస్తున్నది? ఇంతసేపు చుక్కల ముగ్గును గూర్చి ప్రస్తావించే క్రమంలో ఏ విషయాన్ని ఇక్కడ చెప్పదలచుకున్నారు మీరు? ఆ విషయాన్ని చెప్పండి ? అని మీరు అనవచ్చు. వినండి!

జీవితంలో మన మనసులో ఎన్నో ప్రశ్నలు మెదులుతాయి. నేను ఎందుకు పుట్టాను ?వీరికే ఎందుకు పుట్టాను? ఎపుడు పుట్టాను? ఎక్కడ పుట్టాను? పుట్టి నేనేమి చేయాలి? పుట్టడం ఆవశ్యకమా? మళ్లీ పుడతానా? అని ఈ విధంగా ఎన్నెన్నో ప్రశ్నలు! ఎన్నెన్నో పరంపరగా ప్రశ్నలు! మన మనసులో ఏర్పడే ఈ ప్రశ్నలకు అన్నిటికీ సమాధానాలు దొరకాలి. మన మనసులో ఈ విధంగా ఏర్పడే ప్రశ్నలు అన్నీ ముగ్గు ఆరంభంలో పెట్టే చుక్కలవంటివి అని భావించండి. ముగ్గులో ఎన్నో చుక్కలు, ఎన్నో విధాలుగా పెట్టినట్లుగా, మన జీవితంలో కూడా ఎన్నో ప్రశ్నలు, ఎన్నో విధాలుగా కలుగుతాయి. అయితే ఈ ప్రశ్నలకు తగిన సమాధానాలు కావాలి. అన్నీ కలసి ఒక ముగ్గువలె అందమైన కథారూపాన్ని పొందాలి.

జీవితంలో మన మనసులో కలిగే ప్రశ్నలకు తగిన సమాధానాలు పురాణాలలో, ఇతిహాసాలలో ఆయా కథల రూపంలో తెలియజేయ బడ్డాయి. రామాయణ కథను మనం చెప్పు కుంటాము. వాటిని అన్నిటినీ కలుపుకొని ఒక కథద్వారా, ఒక ఉపాఖ్యానం ద్వారా తగిన సమాధానాలను తెలియజేస్తే, అది ఎంతో రమణీయంగా, హృద్యంగా ఉంటుంది. ఈ విధంగా మన మనసులో ఏర్పడే చుక్కల వంటి ప్రశ్నలకు సమాధానాన్ని తెలుపడం కోసమే ఈ పురాణాలు, ఇతిహాసాలు ఏర్పడ్డాయి. వీటిలో తెలుపబడిన వృత్తాంతాలు చాలా అందంగా ఉంటాయి. అందమైన ముగ్గుకు చుక్కలు ఆధారం అయినట్లు అందంగా ఉండే ఉపాఖ్యానాలకు అన్నిటికీ మూలం పలు విధాలయిన చుక్కల వంటి ప్రశ్నలే. పురాణాలలోని వృత్తాంతాలను మనం కథలుగా చెప్పుకుంటాము. ప్రవచనాలుగా వింటాము, గానం చేస్తాము. భజనలు చేస్తాం ఉత్సవాలుగా నిర్వహిస్తాము. రామాయణ కథను హరికథగా గానం చేయవచ్చు.

(మిగతా 21 వ పేజీలో)

# భగవద్విషయం వైరాగ్యం

## అవయవ విభూతి



**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**

(గత సంచిక తరువాయి)

**పృష్ఠం మాలాధరం తథా:** అనగా రామానుజుల వారి వీపు భాగం. అక్కడ తిరుమాలై ఆండాన్ అనే మహానుభావులు వేంచేసి ఉంటారట. తిరువాయ్‌మొళి దివ్యప్రబంధానికి కన్నతల్లి నమ్మాళ్వార్లు అయితే పెంచిన తల్లి భగవద్రామానుజులు. ఈ తిరుమాలై ఆండాన్ అనే ఆచార్యులు భగవద్రామానుజులకు భగవద్విషయ కాలక్షేపం అనుగ్రహించిన వారు శ్రీఆళ్వందార్ల శిష్యులు వీరు. తిరుమాలై ఆణ్డాన్ సన్నిధిలో రామానుజుల వారు శఠకోపుల పాశురార్థాలను వినేటప్పుడు నూతనమైన అర్థాలు గోచరించేవట! వాటిని పలుకగా శ్రీఆణ్డాన్ అంగీకరించ కుండా కాలక్షేపాన్ని నిలిపి వేసేరట ఓమారు. అటు తరువాత గోష్ఠిపూర్ణుల వద్ద రామానుజులవారు చెప్పిన అర్థాలన్నీ మునుపు వారి ఆచార్యులైన శ్రీ ఆళ్వాందార్లు పలికినవే అన్న విషయం శ్రీఆణ్డాన్ విన్న పిమ్మట తమ కుమారుని వారికే శిష్యునిగా చేసేరట. అందువలన రామానుజుల వారి వీపు భాగం సేవిస్తే భగవద్విషయ కాలక్షేపం అనగా భగవద్విషయ అర్థాలు లభిస్తాయట మనకు.

ఈ విధంగా భగవద్రామానుజులు పంచాచార్యులను పొందిన వారయ్యారు. పెరియనంబిగారి వద్ద సమాశ్రయణం మరియు ద్వయమంత్ర అర్థాలు, గోష్ఠీపూర్ణులవద్ద అష్టాక్షరీ మరియు చరము శ్లోక వివరణము, శ్రీమాలాధరుల వద్ద భగవద్విషయ కాలక్షేపం, తిరుమల నంబి గారి వద్ద శ్రీరామాయణ రహస్యార్థాలు, అలాగే శ్రీ తిరువరంగ ప్పెరుమాళ్ అరయర్ల దగ్గర మరికొన్ని వేదాంత రహస్యాలను సేవించేరు భగవద్రామానుజులు. ఈ ఆచార్యులందరూ కూడా ఆళ్వందార్ల శ్రీపాదాలను ఆశ్రయించి జ్ఞాన సంపదను పొందినవారే!

**కటిం కాంచీమునిం జ్ఞేయం:-** **"దేవరాజ దయాపాత్రం శ్రీకాంచీపూర్ణముత్తమమ్"** అంటారు! శ్రీదేవరాజుల పరిపూర్ణమైన కృపకు పాత్రులైనవారు తిరుకచ్చినంబిగారు. వీరినే కాంచిపూర్ణులు అని కూడా సేవిస్తాం. సాక్షాత్తు భగవంతుడితో స్వయంగా మాట్లాడే భాగ్యం పొందిన ఈ మహానుభావులు అంత వినయంగా నిరాడంబరంగా, బొత్తిగా అహంకారం అన్నది లేకుండా ఉంటున్నారో అని ఆశ్చర్యపడేవారట భగవద్రామానుజులు. వారి పాదాలకు నమస్కరించాలని వారు స్వీకరించగా మిగిలిన ఆహార పదార్థమును శేషప్రసాదంగా స్వీకరించాలని ఆశపడేవారట! మరి ఇవే కదా విప్లవాత్మకమైన భావాలు, అవి కూడా ఆ రోజులలో ఏ వర్ణంలో పుట్టేము అన్నదానికన్నా ఎటువంటి జీవితము గడుపుతున్నాము అన్నదే ముఖ్యమైనదని భావించే వారు. అందువలన భగవద్రామానుజుల నడుము భాగం సేవిస్తే అక్కడ తిరుక్కచ్చినంబి గారు వేంచేసి ఉంటారు కాబట్టి మనకు ఆచార్య శేషప్రసాదం లభిస్తుందిట !

ఆ నడుమును వర్ణిస్తున్నారు. వరదరాజస్తవంలో శ్రీకూరత్తాళ్వాన్ అడుగుతారు దేవరాజ పెరుమాళ్ళని. స్వామి నీ ఉదరం, సమస్త బ్రహ్మాండాలకు వాసస్థానం అని బ్రహ్మాదులు మహర్షులు చెబుతారు మరి అది నిజమే అయితే నీ నడుము ఏంటయ్యా! అంత సన్నగా ఉన్నది అని. మరి రామానుజుల వారు "వైరాగ్యశిఖామణి" ఆ పూటకు శరీరం నిలవడానికి కావలసిన ఆహారము మాత్రము పుచ్చుకొనే వారట! పాలసముద్రము క్షుభితమై రెండు మూడు కెరటములు తీరమునకు వచ్చి విస్తరించినవై యున్నట్టు రెండు ప్రక్కలలోనూ త్రివళులను అంటే మూడు మడుపులను కలిగినదై ఉన్నదట రామానుజుల వారి నడుము స్థానం.

**గోవిందార్యం నితంబకమ్ :-** ఎంబార్లే లేకపోతే మనకు రామానుజుల వారు దక్కేవారు కాదేమో! రామానుజులకు పూర్వాశ్రమంలో పినతల్లి కుమారులు ఈ ఎంబార్లు. రామానుజుల వారు ఎంబార్ల ఆత్మని సంరక్షిస్తే ఎంబార్లు రామానుజుల వారి దేహాన్ని కాపాడేరు యాదవ ప్రకాశుల వారి గోష్ఠి నుండి. ఈ విధంగా ఆచార్య శిష్య లక్షణాలను తెలియచేసేరు ఇరువురు! **"రామానుజ పదఛ్ఛాయా**

భగవద్విషయం
వైరాగ్యం

## అవయవ విభూతి

గోవిందాహ్వయ పాయినే" అని వారి తనియన్. రామానుజులవారి శ్రీపాదాలని నీడలా అంటి పెట్టుకొని ఉండేవారు. ఎన్ని విధాలుగా చెప్పినా భార్యతో కాపురం చేయని వైనం చూసి వీరు ఇక గృహస్థాశ్రమంలో నిలువలేరని కాషాయాన్ని అనుగ్రహించారు ఎంబార్లకు. అందువలన భగవద్రామానుజుల వారి పిరుదులను సేవిస్తే మనకు వైరాగ్యం కలుగుతుందిట! మరి వైరాగ్యం కూడా అష్టైశ్వర్యాలలో ఒకటి కదా! శఠకోపులనెడి ముని సార్వభౌముల జైత్రయాత్ర రథమే రామానుజుల వారి దివ్య దేహము క్రింద రూపు దాలిస్తే, ఈ రెండు పృధు నితంబ బింబములు ఆ రథానికి రెండు గుండ్రటి చక్రమండలము లుగా ఉన్నాయిట! ఒక అద్భుతమైన పాశురాన్ని అనుగ్రహిస్తారు ఎంబార్లు.

**"పఱ్పమెనత్తికళ్పైజ్ఞళన్టన్ పల్లనమే విరలుమ్**
**పావనమాకియ పైన్దువరాడై పదిన్దమరజ్ఞళకుమ్**
**ముప్పురినూలాడు మున్కైయిలేన్దియ ముక్కోల్ తన్నళకుమ్**
**మున్నవర్ తన్దిడు మొళికళ్ నిఱైన్దిడు ముఱవల్ నిలావళకుమ్**
**కఱ్పకమే విళికరుణై పోళ్తిన్దిడు కమలక్కణ్ణళకుమ్**
**కారిశుతన్కళల్ శూడియు ముడియుమ్ కననత్చిక్కై ముడియుమ్**
**ఎప్పొళుతుమ్ ఎతిరాశన్వడివళి కెన్నిత్తుయతుళతాల్**
**ఇల్లై యెనక్కెదిరిల్లై యెనక్కేతిరిల్లై యెనక్కేదిరే"**

ఈ పాశురార్థాన్ని వివరిస్తున్నారు. రామానుజుల వారి శ్రీపాదాలు పద్మములను పోలి ఉన్నాయట! లేత చిగుళ్ళ వంటి వ్రేళ్ళుట, కొట్టొచ్చినట్టు కనపడే కమనీయమైన కాషాయము, వైరాగ్యశోభని చెప్పే సన్నని నడుము, మూడు పేటలు గల యజ్ఞోపవీతము, శ్రీహస్తములయందు ఉజ్జ్వలమైన త్రిదండము, పూర్వాచార్యులు అందించిన శ్రీ సూక్తులను అందరికీ అనుగ్రహించాలి అనే ఆకాంక్షతో, ఆనందంతో మిళితమై ఉన్న చిన్న చిరునవ్వు, దయ, కరుణ అనే కటాక్షాలను వర్షించే రెండు నేత్రములు, శఠకోపుల శ్రీపాదాలను ధరించిన శిరస్సు కలిగిన గొప్పదైన శిఖ. ఇలాంటి అందం ఎల్లప్పుడూ నా హృదయంతో నుండుట చేత నాకు ఎదురు లేదు. నాకెదురులేరు. ఎదురులేరు అని.

## చుక్కని చుక్కల ముగ్గులు

(19 వ పేజీ తరువాయి) దానిని ఒక నాటకంగా ప్రదర్శించవచ్చు. బుర్రకథగా చెప్పినప్పుడు విని ఆనందించవచ్చు. ఇవి అన్నీ, ముగ్గులను రంగులతో అలంకరించడం వంటివే. అయితే, ముగ్గులకు అన్నిటికి మొట్ట మొదటగా చుక్కలు ఆధారం అయినట్లుగా ఈ పురాణాలలో, ఇతిహాసాలలో ప్రస్తావించబడిన కథలకు అన్నిటికి మన మనసులలో మెదిలే ప్రశ్నలే ఆధారం. వీటికి సమాధానం తెలుపడం కోసమే మహర్షులు ఇతిహాస పురాణాదులను రచించారు. అందుకోసమే భగవంతుడు అవతరించాడు. ఎన్నెన్నో లీలలను చేశాడు. అందరి మనసులలో ఏర్పడే ప్రశ్నలకు అన్నిటికి కలిపి తగిన అందమైన సమాధానాన్ని ఒక ఉపాఖ్యాన రూపంలో తెలిపినట్లయితే, చుక్కలను అన్నిటినీ కలిపి ఒక ముగ్గును రచించినప్పుడువలె, చాలా అందంగా ఉంటుంది. మనసును ఆకర్షిస్తుంది. రామాయణాన్ని పూర్తిగా అధ్యయనం చేయగా చేయగా, భగవద్గీతను సంపూర్ణంగా అధ్యయనం చేయగా చేయగా, మహా భాగవత కథలను మాటిమాటికి శ్రవణం చేయగా చేయగా, ఆ విధంగానే, పురాణేతిహాసాలలోని కథలలో కనిపించే అందాన్ని మనం ఆస్వాదించినట్లయితే, వాటి వెనుక ఉండే ప్రశ్నలు తప్పక మనకు అర్థం అవుతాయి. చుక్కలు, ముగ్గులు, వాటి పైన పూసిన రంగులవలె ఉండే ప్రశ్నలు, వాటిని ఆధారంగా చేసికొని రచింపబడిన కథలు, ఆ సందేహాలకు నివృత్తి అన్నీ మనకు అర్థం అవుతాయి.

ఇది ఎంతటి అందమైన దృశ్యం. ఆ కథలు చాలా అందంగా ఉంటాయి. అవే ఉపన్యాసాలుగా, హరికథలుగా వినడం, భజనలుగా చేయడం, సీతా కళ్యాణం, రుక్మిణీకళ్యాణం, గోదా కళ్యాణం మొదలైన ఉత్సవాలు నిర్వహించడం అనే ఇవి అన్నీ, ఆ కథలు అనే ముగ్గులకు మరింత శోభను కలుగజేసే రంగులవంటివి. ఈ విధంగా మహర్షులు మహనీయుల అందమైన వృత్తాంతాలను మన సంప్రదాయ పరిరక్షణ కోసం గొప్ప పురాణేతిహాసాలుగా తీర్చిదిద్దారు. వాటిని అధ్యయనం చేసి, వాటిలో మనకు స్ఫురించే అందమైన తత్త్వాలను, వాటికి మూలమైన ప్రశ్నలను గమనించి, భావించి ఆనందిద్దాం. మన జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలకు తగిన సమాధానాలను తెలిసికొందాం. స్వస్తి. ★

# భరన్యాసము
# భగవంతుని పైనే భారము...

(15 వ పేజీ తరువాయి) ఆత్మను సమర్పిస్తారు! ఇలా పరమాత్మకు శరణాగతి చేస్తారు! ఎవరు? జ్ఞానులు! ఇలా ఆత్మసమర్పణం శ్రియఃపతికి చేస్తారు! ఇదియే శరణాగతి ! నేను ఎలా వున్నాను? మన ఆళ్వార్లు ఎంతో చక్కగా దీనిని గురించి చెప్పారు.

**"నమ్బినేన్! పిఱర్ నన్పొరుళ్ తన్నైయుం**
**నమ్బినేన్! మడవారైయుం మున్నెలాం**
**శెన్బొన్ మాడ తిరు కురుగూర్ నమ్బిక్కు**
**అన్బనాయ్ అడియేన్ శదిత్తేన్ ఇన్రే"** అని. ఇన్నాళ్ళు నాదికానిది నాదని నమ్మినాను. ఆత్మ స్వతంత్రుడనుకొన్నాను! ఎలా వున్నాను నేను? **"యానే యెన్దనదే ఎన్రు ఇరుందేన్"** శరీరం వేరు ఆత్మ వేరు అని అనుకొన్నాను! నేను స్వతంత్రుడననుకొన్నాను! కానీ ఇప్పుడు! **"యానే నీ ఎన్ వుడమైయ్యుం నీ"** ఆత్మ పరతంత్రుడని తెలుసుకొన్నాను! తిరుకురుగూర్ నమ్బిక్కు చెందినవాడను నేను అని ఎప్పుడైతే తెలుసుకొన్నానో పరతంత్రుడనై ఆయనకు ప్రీతిపూర్వకముగా అడియేన్ నన్ను నేను సమర్పించు కొన్నాను! **"ఎన్నైయుం ఎన్ ఒడమైయైయుం, ఒన్ శక్కరపొరి యొత్రికొండు"** పంచసంస్కారము చేసుకొనే వరకు 'నేను నన్ను నాది నాకు నావల్ల' అంతా అహంకార పూర్వముగా వుండింది. శరణాగతి పొందిన తరువాత నిన్నరుళే పురిందిరుందేన్ నీ రక్షణ ఛత్రము క్రిందకు వచ్చేసాను, నీ యొక్క ప్రేమవల్ల అలా ఆత్మ సమర్పణము చేసుకొన్నతరువాత **"ఉన్నాలల్లాల్ యావరాలుం ఒణ్ణుం కురైవేండేన్"** నీవల్లతప్ప పరమాత్మా! ఇంకెరివల్ల నన్ను రక్షించడము సాధ్యము? ఎవరి మీద భారము, విశ్వాసము, పెట్టగలను? అలా నీవే తప్ప నాకు రక్షకుడెవ్వరూ లేరని నమ్మినప్పుడు దృఢ అధ్యవసానము పెట్టినప్పుడు పరిపూర్ణ ప్రపత్తి దానంతటదే ఏర్పడి పోతుంది! అప్పుడు మనంతట మనము చేసే ఆత్మ సమర్పణమూ వుండదు! పరమాత్మనే రక్షకుడనే విశ్వాసము పూర్తిగా ఏర్పడుతుంది తొండరడి పొడి యాళ్వారన్నట్లు "వాళమ్ సోంబర్" గా అయిన మనను **"తనక్కేయాగ ఎనైకొళ్ళుమీడే"** ఆయనే తనంతట తానుగా స్వీకరిస్తారు! ఆ నిరంకుశ అధికారము ఆయనకే వుంటుంది. మనము చేసేదల్లా జడవత్ పారతంత్ర్యాన్ని అనుసరించడమే! మరి జడమైతే అనుభవమెలా వస్తుంది? అందుకే **"ఒన్ పవళవాయై కాణ్బేనే"** పరమాత్మ **"ముఖమలర్చి"** ముఖోల్లాసమునకొరకే కైంకర్యము! ఆ ముఖోల్లాసమే ఆత్మోపజీవన మంత్రము! పరమాత్మ కటాక్షము కలిగిన మరుక్షణమే పరమపద ప్రాప్తికాదు! **"ద్వయమర్థాను సంధానేన అత్రయేవ సుఖమాస్వ"** రంగనాథులవారు రామానుజుల వారికి ఆనతిచ్చినది! ద్వయమంత్రార్థమును అంతరంగములో నింపుకొంటూ జపించుకొంటూ ఇక్కడే సుఖముగా వుండు! ఎందుకు **"మరణమాక్కి" మరణమును ప్రసాదించి కాదు! మరణమానాల్ వైగుందం తరుం"** పరమాత్మ మరణానంతరము వైకుంఠమును ప్రసాదిస్తారు! అప్పటివరకు మనము ద్వయమంత్రమును అర్థానుపూర్వకముగా అనుసంధిస్తూ పరమపదములో కైంకర్యంలా లీలా విభూతిలోనూ కైంకర్యమును సాయిస్తూ శేష జీవనమును సాగించాలి. సరే! రక్షణభారము పరమాత్మదే! దానిఫలము? భూమిదున్ని విత్తి పంటను పురుగు పుట్రనుండి జంతుజాలాలనుండి యజమాని కాపాడింది ఎందుకు? తన అనుభవానికి. అందుకే ఆళ్వారు అన్నారు **తమక్కేయాగ ఎనై కొళ్ళుమీరే!, ఎనక్కే కణ్ణనై యాన్ కొళ్ శిరప్పే** అనగా తనకొరకే నన్ను స్వీకరిస్తారు పెరుమాళ్! అంటారు. ఇలా ఆళ్వార్ల పాసురాలతో ఈ శ్లోకాన్ని అనుసంధించుకొని చూశాము! ఇంక తిరుమంత్రముతో అనుసంధించుకోవాలి! కవితార్కికసింహులు ఒక శ్లోకం చెప్పారంటే దానిలో ఎంతో గొప్ప అర్థాలు ఇమిడి వుంటాయి. ఈ మొదటి శ్లోకానికి తిరుమంత్రానికి వున్న అన్వయము చూద్దాము. అహం నమమ శ్రీపతేరేవ నేను నాకుచెందినవాడిని కాను, **పారతంత్ర్యము.** పరమాత్మకే చెందిన వాడిని. ఈ పారతంత్ర్యాన్నే తిరుమంత్రం ముందు ప్రణవము **ఓం** కారము ద్వారా తెలియపరుస్తుంది. ఆత్మ స్వరూపజ్ఞానము. **అనన్యార్హ శేషత్వము. "మద్రక్షణ పరః నమమ శ్రీపతేరేవ"** నాకు నేను రక్షకుడిని కాను! పరమాత్మయే నాకు రక్షకుడు అని **అనన్య శరణత్వమును** చాటారు. మద్రక్షణ ఫలం తథా నమమ. శ్రీపతేరేవ **నారాయణాయ**". నన్నురక్షించి కాపాడడము నారాయణుని కొరకే ! ఆయన వినియోగ వస్తువుగా నేను వున్నందువలననే! ఇది అనన్య భోగ్యత్వం!. ఇలా తిరుమంత్రార్థము సమన్వయము చేసి చెప్పబడినది! తిరుమంత్రార్థము భగవత్ విషయము న్యాసదశకములో ఎలా ఇమిడింది? అనే అంశాన్ని చూద్దాము! (సశేషం)

## శ్రీపతి స్తుతి — సుభాషితం

(10 వ పేజీ తరువాయి) సుఖాలూ కలుగుతాయి. ఐతే ఒక సందేహం! ఎట్లాచదవాలి? స్నానాదులు చేసినాంకనా? భక్తి తోనా? భావం తెలిసికోనా ? అని. సారాంశం ఏమిటి అంటే మామూలుగా చదివినా ఫలితం వుంటుంది. మరి 'అర్థం లేనిది వ్యర్థం' అంటారు గదా! నిజమే! అర్థం తెలిస్తే 'బంగారానికి పరిమళం లభించినట్లు' దానిపై గౌరవం, భక్తి విశ్వాసాదులు కలుగుతవి. ఫలితం తప్పక వుంటుంది అని మనం హరి అష్టకం' మొదటి శ్లోకంలో విన్నాం. అనిచ్ఛయాపి సంస్పృష్టః... నిప్పు కాలుతుంది అని. అట్లే మరో శ్లోకంలో విన్నాం. భాగవతం 6వ స్కంధంలోని అజామిళోపాఖ్యానంలో **'సాంకేత్యం పారిహాస్యంచ'** అనే శ్లోకంలో ఎప్పుడు? అనే దానికి **'మహత్యాపది సంప్రాప్తే'** అని ఆపద కలిగినప్పుడు శుచిగానే చదవాలా? అనేదానికి ద్రౌపదిని దృష్టాంతంగా విన్నాము. కాబట్టి ఎంతకాలం? అనే ప్రశ్నకు 'అప్రయాణాత్' అంటే మనం 'ఈ లోకం విడిచి ప్రయాణం అయ్యేంత వరకు' అని బ్రహ్మసూత్ర కారులు చెప్పినారు. (మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో)

## శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

( 11 వ పేజీ తరువాయి ) గృహ నిర్మాత తన నామ వర్గమునకు యోగ్యముగానుండు గ్రామమును చక్కగా నిర్ణయించుకొని తర్వాత గ్రామమునకు గ్రామమధ్యము నుండి దిక్కులను, వర్గములను, యోనులను చక్కగా నేర్పరచుకొని అందులో తన నామాద్యక్షరమున్న వర్గ దిశాస్థానము స్వవర్గ మనియు, స్వవర్గ మందు గృహము నిర్మించుకొనిన బలము తేజస్సు గలుగును. స్వవర్గ స్థానమునుండి పంచమ దిశా స్థానము శతృస్థానము. ఈ స్థానమందు గృహనిర్మాణము కావించిన శతృభయము, సర్వ నాశము కలుగును. తదుపరి మిత్ర, సమవర్గ దిశలలో గృహము నిర్మించిన, మిత్రవృద్ధి శుభము సమవర్గములో నిర్మించిన సామాన్యముగా నుండుననియు వర్గప్రయోజనము ప్రతిపాదింపబడినది. కావున జాగ్రత్తగా గృహము నిర్మించుకొనవలయును

(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)


## పుస్తక పరిచయం

పూర్వాచార్యులు విశేష వ్యాఖ్యానాలు వెలువరించినా, సాంప్రదాయ పండితులు విస్తరించి వివరించినా గోదాకృత తిరుప్పావై భక్తి మాధురి అంతులేనిది,అనిర్వచనీయమైనది. ఆ క్రమంలో విశేష రచనలకు అముద్రితాలకు ముద్రణలు, పునర్ ముద్రణలు కూడా అవశ్యకమే శ్రీ సాంప్రదాయ గోష్ఠి భాగ్యనగరం వారి సమర్పణలో విద్వాన్ డా. కోయిల్ కందాడై వేంకట సుందరాచార్యులు మనస్విని ప్రచురణలలో ముద్రితమైన గ్రంథరాజం "తిరుప్పావై" ఆరాయిరప్పడి వ్యాఖ్యాన సహితం. అళగియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్లచే రచింపబడిన ఆరాయిరప్పడి ద్రావిడ వ్యాఖ్యానమునకు వారిచే ఆంధ్రీకరింప బడిన గ్రంథము ఇది. కావ్యరత్న వేదాంత రత్న వేదాంత తీర్థ వేదాంత వాచస్పతి కందాడై శేషాచార్యుల వారిచే టీకా తాత్పర్య స్వాపదేశార్థములతో రచింపబడినది. ద్రావిడ వ్యాఖ్యాన మూలానికి ఆంధ్రీకరించిన తెలుగు వివరణ కలదు. 1939లో ప్రచురించబడిన గ్రంథానికి ఇది పునర్ ముద్రణ. ఆకర్షణీయమైన ముఖచిత్రంతో 500 పైగా పేజీలు కలిగి ఎంతో సుందరంగా ఉంది. వర్ధమాన తిరుప్పావై ప్రవచనా పండితులకు చక్కని అధ్యయన గ్రంథంగా ఉపయోగపడుతుంది. మరియు సాంప్రదాయ విశేషాలు ఎన్నింటినో తెలుసుకొనుటకు పరిశీలనా గ్రంథంగా కూడా ఉపయోగపడుతుంది. ఇటీవలనే ఆవిష్కరింపబడి అందుబాటులో ఉంది. లభించు సమాచారమునకు సంప్రదించు ఫోన్ నెంబర్






# దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనం













## ఆధ్యాత్మిక వార్తలు

అయోధ్యలో చారిత్రాత్మకంగా నిర్మించబడిన శ్రీరామ మందిర నిర్మాణం పూర్తికాబడి ప్రారంభోత్సవ ప్రతిష్ఠాపన జనవరి 22న జరగనున్నది. దీనికోసం దేశంలోని లబ్ధప్రతిష్ఠులైన జ్యోతిష్కులతో ముహూర్తాన్ని నిర్ణయించారు.



## గీతాజయంతి సందర్భంగా *భగవద్గీత పఠన పోటీలు*

గీతాజయంతి సందర్భంగా కరీంనగర్ వేదభవనంలో భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. త్రిదండి దేవనాథ జీయర్ స్వామి పర్యవేక్షణలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో భగవద్గీత అవధాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి ఇతర అధ్యాపకులు, గౌతంరావ్ (వికాసతరంగిణి), వేదాచార్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు భక్తులు పాల్గొన్నారు.



